thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

### భారత్ అఫ్గాన్ షెడ్యూల్ విడుదల



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 146 | జగిత్యాల శనివారం 29 ఆగస్టు, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ల్యాండింగ్‌లో పేలిన టైర్

- త్రుటిలో తప్పిన ముప్పు
- ఢిల్లీ-బిలాస్‌పూర్ అలయన్స్ విమానంలో ఘటన
- 37 మంది ప్రయాణికులు సహా 41 మంది సురక్షితం



.. వివరాలు ౦4లో

## సోనియా ఆత్మకథపై 'ప్రచురణ' రగడ

- 'బిలాంగింగ్'కు తాము ప్రచురణకర్తలం కాదన్న పెంగ్విన్ ఇండియా
- మోదీ, ఆర్ఎస్ఎస్, భారత్-చైనా అంశాల్లో మార్పులు కోరారంటూ కాంగ్రెస్ ఆరోపణ
- సంపాదకీయ మార్పుల వివాదంపై ప్రచురణ సంస్థ వివరణ

4




## నేపాల్ వరదల్లో 1,400 మందికి పైగా గల్లంతు



- గల్లంతైన వారి జాబితాను విడుదల చేసిన నేపాల్ పోలీసులు
- 178 మంది భారతీయులు సహా 644 మంది వివరాల వెల్లడి
- సుమారు 320 మంది భారతీయుల ఆచూకీ లేదన్న విదేశాంగ శాఖ

4



# బంగారు గనుల తవ్వకాల్లో హట్టి-సింగరేణి జతకట్టాలి

భవిష్యత్తు ప్రాజెక్టుల్లో కలిసి పనిచేయాలి

వివరాలు 2లో

- సింగరేణి అధికారులకు భట్టి విక్రమార్క దిశా నిర్దేశం
- హట్టి, యుటీ బంగారు గనులలో భట్టి వివిస్తృత పర్యటన

బంగారం అన్వేషణ, తవ్వకాల్లో అపార అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ రంగ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో తెలంగాణకు చెందిన సింగరేణి కాలరీస్ చేతులు కలిపే దిశగా అడుగులు పడుతున్నాయి. భవిష్యత్ బంగారు గనుల ప్రాజెక్టుల్లో రెండు సంస్థలు సంయుక్త భాగస్వామ్యంతో పనిచేసే అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క సింగోరేణి అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని కలిపితే దేశీయ బంగారం ఉత్పత్తిని పెంచడంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

*- రాయచూర్, ఆగస్టు 28*



# సీఎంకు రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

### వివాదాల తర్వాత తొలిసారి రేవంత్ నివాసానికి సురేఖ

- ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన మంత్రులు సీతక్క, సురేఖ
- 'ఆడబిడ్డల ఆశీర్వాదం సీఎంకు ఎప్పుడూ ఉంటుంది'
- రాజకీయ వ్యాఖ్యలకు ఇది సమయం కాదన్న కొండా సురేఖ
- బ్రహ్మకుమారీలు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డుల రాఖీలు

2





## చిన్నోడి చేతిలో డ్రా సొంతింటి కల సాకారం!

- బాలుడు తీసిన లక్కీడ్రాలో సొంత కుటుంబానికే ఇల్లు
- మైలార్‌దేవుపల్లి లక్ష్మీగూడలో ఆసక్తికర సన్నివేశం
- వీడియోను పంచుకున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- 16 నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఇళ్లకు లక్కీడ్రా
- అర్హులందరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు కేటాయిస్తామని వెల్లడి

2

## అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర




- ఒకేసారి 15,982 పోస్టుల భర్తీకి సర్కారు నిర్ణయం
- 3,100 టీచర్.. 12,882 ఆయా పోస్టులకు అవకాశం
- ఇంటర్ అర్హతతోనే దరఖాస్తుకు అవకాశం
- జిల్లా స్థాయిలో ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థుల ఎంపిక
- సెప్టెంబర్‌లోగా నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు

2

## రాయదుర్గం భూమి బంగారు గని

269 కోట్లకు ఎకరా పలికిన ధర



2



## అమెరికాలో తెలుగు యువతి హత్య

- ఆగ్రాలో నిందితుడి పట్టివేత
- అమెరికాకు అప్పగించనున్న పోలీసులు

2

# పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డారు!

- కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయారు
- రేషన్ కార్డుపై మోదీ ఫొటో ఏది?
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- ఇందిరమ్మ ఇళ్లలో పక్షపాతమంటూ ఫైర్
- కేంద్ర నిధులతోనే అభివృద్ధి అంటూ వ్యాఖ్య
- సీఎస్‌తో రైల్వే సమస్యలపై చర్చ

3





3

## కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ 'వారం పోరు'

పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు




## నేరాలపై 'టెక్' నిఘా పెంచాలి

- పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్
- గణాంకాలకే పరిమితం కాకుండా నేరం వెనుక కారణాలనూ విశ్లేషించాలి
- మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు
- మాదకద్రవ్యాల కేసుల్లో 46.10 శాతం పెరుగుదల

3





# అమెరికాలో తెలుగు యువతి హత్య

## ఆగ్రాలో నిందితుడి పట్టివేత

## అమెరికాకు అప్పగించనున్న పోలీసులు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 28:** అమెరికాలో సంచలనం సృష్టించిన హైదరాబాద్ యువతి నిఖిత గోదిశాల (27) హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హత్య కేసు నిందితుడు, ఆమె మాజీ రూమ్‌మేట్ అర్జున్ శర్మ (26)ను హైదరాబాద్ పోలీసులు ఆగ్రాలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించింది. ఈ హత్య కేసులో భాగంగా ఇప్పటికే నిందితుడిపై అమెరికా పోలీసులు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దీంతో ప్రస్తుతం అమెరికా అధికారులకు అర్జున్ శర్మను అప్పగించే పక్రియ కొనసాగుతోంది. హైదరాబాద్‌కు చెందిన నిఖిత గోదిశాల అమెరికాలోని మేరీల్యాండ్‌లోని ఎల్లికాట్ సిటీలో ఉద్యోగం చేస్తోంది. ఆమె కనిపించడం లేదంటూ జనవరి 2న ఫిర్యాదు అందడంతో హోవర్డ్ కౌంటీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మేరీల్యాండ్‌లోని అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో నిఖిత మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆమె శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో శర్మపై ఫస్ట్-డిగ్రీ, సెకండ్-డిగ్రీ హత్యారోపణలతో అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దీంతో నిందితుడు భారత్‌కు పారిపోయి వచ్చాడు. మరోవైపు, డిసెంబర్ 31, 2025న నిఖిత హత్యకు గురైనట్లు బాధిత కుటుంబ సభ్యులకు భారత అధికారులు సమాచారం అందించారు. నిఖిత తండ్రి ఆనంద్ గోదిశాల ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తెలంగాణలోనూ అర్జున్‌పై మోసం కేసు నమోదైంది. నిఖిత నుంచి డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వలేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏప్రిల్‌లో కేసు నమోదు చేసిన హైదరాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో లభించిన ఆధారాలతో ఆగ్రాలో అర్జున్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి ఓ ఎ÷-లాట్‌లో అతడిని అదుపులోకి తీసుకుంది. అనంతరం హత్య కేసు దర్యాప్తులో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించారు. న్యూఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో ఆగస్టు 25న హాజరుపరుచగా.. హత్యకు సంబంధించిన కేసులో రిమాండ్ విధించింది.

# బంగారు గని రాయదుర్గం భూమి

## 269 కోట్లకు ఎకరా పలికిన ధర

**హైదరాబాద్, ఆగస్ట్ 28:** రాయదుర్గం భూములు బంగారు గనిగా మారాయి. వేలంపై సుప్రీం తీర్పు తరవాత వాటికి బంగారాన్ని మించిన ధరలు పలుకుతున్నాయి. ఇలా హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి రికార్డు సృష్టించాయి. రాయదుర్గంలో ఎకరం భూమి ధర ఏకంగా రూ.269 కోట్లు పలికింది. వారం క్రితం ఇక్కడే ఎకరం ధర రూ.264 కోట్లు పలకగా, తాజాగా దాని పక్కనే ఉన్న ప్లాట్‌లో ఎకరానికి రూ.269 కోట్లు పలకడం విశేషం. రాయదుర్గం సర్వే నంబరు 83/1లోని 5.38 ఎకరాలకు తాజాగా టీజీఐఐసీ వేలం నిర్వహించింది. కనీస ధర రూ.175 కోట్లుగా నిర్ణయించింది. రూ.10 కోట్లు ముందస్తుగా చెల్లించిన వారికి ఆన్‌లైన్ వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. దీంతో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటీపడ్డాయి. చివరికి వంశీరాం బిల్డర్స్ ఎకరానికి రూ.269 కోట్ల చొప్పున 5.38 ఎకరాలను కొనుగోలు చేసింది. దీంతో టీజీఐఐసీ కాసుల పంట పండినట్లైంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.1,447 కోట్లు సమకూరాయి.

# అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర

## ఒకేసారి 15,982 పోస్టుల భర్తీకి సర్కారు నిర్ణయం

## 3,100 టీచర్.. 12,882 ఆయా పోస్టులకు అవకాశం

## ఇంటర్ అర్హతతోనే దరఖాస్తుకు అవకాశం

## జిల్లా స్థాయిలో ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థుల ఎంపిక

## సెప్టెంబర్‌లోగా నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్టు 28:** తెలంగాణలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న మహిళలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భారీ సంఖ్యలో భర్తీ చేసేందుకు నిర్ణయించింది. మొత్తం 15,982 అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను సెప్టెంబర్‌లోగా భర్తీ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. నియామకాలను జిల్లా స్థాయిలో చేపట్టనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జోన్-1 పరిధిలో 1,853 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు భర్తీ చేయనున్నారు. జోన్--2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులు ఉన్నాయి. మొ-త్తంగా 3,100 టీచర్ పోస్టులు, 12,882 ఆయా పోస్టులతో కలిపి 15,982 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం నిర్దేశించింది. అభ్యర్థుల ఎంపికలో ఇంటర్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు మరో 10 శాతం మార్కులు కేటాయించనున్నారు. ప్రత్యేక కేటగిరీలకు అదనపు వెయిటేజీ కల్పించనున్నారు. వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ ఇవ్వనున్నారు. నిర్ణీత ప్రమాణాల ఆధారంగా జిల్లా స్థాయిలోనే ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఒకేసారి దాదాపు 16 వేల అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమవుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

# బంగారు గనుల తవ్వకాల్లో హట్టి-సింగరేణి జతకట్టాలి

- భవిష్యత్తు ప్రాజెక్టుల్లో కలిసి పనిచేయాలి
- సింగరేణి అధికారులకు భట్టి విక్రమార్క దిశా నిర్దేశం
- హట్టి, యుటీ బంగారు గనులలో భట్టి విస్తృత పర్యటన




**రాయచూర్, ఆగస్టు 28:** బంగారం అన్వేషణ, తవ్వకాల్లో అపార అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ రంగ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో తెలంగాణకు చెందిన సింగరేణి కాలరీస్ చేతులు కలిపే దిశగా అడుగులు పడుతున్నాయి. భవిష్యత్ బంగారు గనుల ప్రాజెక్టుల్లో రెండు సంస్థలు సంయుక్త భాగస్వామ్యంతో పనిచేసే అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని కలిపితే దేశీయ బంగారం ఉత్పత్తిని పెంచడంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కర్ణాటకలోని బంగారు గనుల ప్రాంతాల్లో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటీ బంగారు గనులను భట్టి విక్రమార్క సందర్శించారు. గని నుంచి బంగారంతో కూడిన ఖనిజాన్ని వెలికితీయడం మొదలు.. దానిని శుద్ధి చేసి బంగారంగా మార్చే వరకు వివిధ దశలను క్షుణ్ణంగా పరిశీలించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, ఖనిజ శుద్ధి, బంగారం తయారీలో హట్టి గోల్డ్ మైన్స్‌కు అపార అనుభవం ఉందని భట్టి పేర్కొన్నారు. బొగ్గుతో పాటు ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక సామర్థ్యాన్ని హట్టి అనుభవంతో అనుసంధానం చేయాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, ఖనిజం వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సాంకేతిక నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర రంగాల్లో రెండు సంస్థలు కలిసి పనిచేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ నిక్షేపాలను శాస్త్రీయంగా అన్వేషించి, వెలికితీసేందుకు సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలని సూచించారు. బంగారం కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి-సింగరేణి భాగస్వామ్యం ద్వారా బంగారం ఉత్పత్తి పెంపుతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడం, దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం సాధ్యమవుతుందని చెప్పారు. హట్టి గోల్డ్ మైన్స్‌లోని ఉత్పత్తి విభాగం, ఖనిజ శుద్ధి కర్మాగారం, ఎలక్ట్రోవిన్నింగ్ విభాగాలను డిప్యూటీ సీఎం పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో శుద్ధి చేసి బంగారంగా మార్చే విధానాన్ని అక్కడి అధికారులు ఆయనకు వివరించారు. హట్టి ప్రాజెక్టులో సగటున రోజుకు రెండు నుంచి నాలుగు కిలోల వరకు బంగారం ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు తెలిపారు. యూటీ ఓపెన్‌కాస్ట్ బంగారు గని వ్యూపాయింట్ నుంచి బంగారంతో కూడిన ఖనిజాన్ని వెలికితీసే ప్రక్రియను భట్టి పరిశీలించారు. బంగారం తయారీకి అవసరమైన ముడి ఖనిజాన్ని ఎంత లోతు నుంచి వెలికితీస్తున్నారు? ఏయే సాంకేతిక పద్ధతులను అనుసరిస్తున్నారు? తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గనులకు సంబంధించిన మ్యాపులను పరిశీలించి బంగారు నిక్షేపాల అన్వేషణలో ఉపయోగిస్తున్న సాంకేతికతపై ఆరా తీశారు. అనంతరం యూటీ భూగర్భ బంగారు గనిలో ఖనిజ తవ్వకాల ప్రక్రియను పరిశీలించారు. భూగర్భంలో ఖనిజం వెలికితీత, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గని ప్రాంతంలో భట్టి విక్రమార్క మొక్క నాటారు. పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూర్ జిల్లా పరిషత్ సభ్యుడు అంజాద్‌తో పాటు హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ్, యెమ్మూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిర్ సాహెబ్ దఫేదార్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

- వివాదాల తరవాత తొలిసారి సీఎం ఇంటికి కొండా సురేఖ
- సీఎంకు ఆడబిడ్డల ఆశీర్వాదాలు ఉండాలని వ్యాఖ్య
- సీఎంకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు, మహిళా కానిస్టేబుల్స్



**హైదరాబాద్, ఆగస్ట్ 28:** రక్షా బంధన్ సందర్భంగా అపూర్వ సన్నివేశం ఆవిష్కృతం అయ్యింది. మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి రేవంత్‌కు రాఖీ కట్టారు. సిఎం కుటుంబ సభ్యులు సమక్షంలో వీరిద్దరు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ.. సీఎం నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. సీఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు. సీఎం రేవంత్‌రెడ్డికి బంగారు రాఖీ కట్టిన తర్వాత.. ఆమె నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి మూడోసారి రాఖీ కట్టా. నేను అందరికీ సోదరినే. పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఆయనకు ఇవ్వాలని దేవుడిని కోరుకున్నా. ఆడబిడ్డల ఆశీర్వాదాలు సీఎంకు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఇటీవల.. ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి పై చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా సురేఖ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే బ్రహ్మకుమారీలు, హోంగార్డులు, మహిళా కానిస్టేబుళ్లు కూడా సిఎం రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టారు. వారి పట్ల సిఎం రేవంత్ వాత్సత్యం ప్రకటించారు.

# చిన్నోడి చేతిలో డ్రా.. సొంతింటి కల సాకారం!

## బాలుడు తీసిన లక్కీడ్రాలో సొంత కుటుంబానికే ఇల్లు

## మైలార్‌దేవుపల్లి లక్ష్మీగూడలో ఆసక్తికర సన్నివేశం

## వీడియోను పంచుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## 16 నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఇళ్లకు లక్కీడ్రా

## అర్హులందరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు కేటాయిస్తామని వెల్లడి



**హైదరాబాద్, ఆగస్టు 28:** లక్కీడ్రా తీసేందుకు ఆ చిన్నోడి చేయి ముందుకు వెళ్లింది.. అందరి చూపూ అతడి చేతిలోని టోకెన్‌పైనే నిలిచింది. టోకెన్ తెరిచి పేరు చూడగానే అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే.. ఆ బాలుడు తీసిన లక్కీడ్రాలో అదృష్టం వరించింది మరెవరికో కాదు.. అతడి సొంత కుటుంబానికే! రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి లక్ష్మీగూడలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు సందర్భంగా ఈ అరుదైన ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఇళ్ల కేటాయింపునకు లక్కీడ్రా ప్రక్రియ ప్రారంభించింది. ఇందులో భాగంగా లక్ష్మీగూడలో లక్కీడ్రా టోకెన్‌ను ఓ బాలుడితో తీయించారు. అతడు తీసిన టోకెన్‌లో జరపుల లక్ష్మి పేరు రావడంతో ఆ కుటుంబ సభ్యులతో పాటు అక్కడున్నవారు ఆనందం, ఆశ్చర్యానికి గురయ్యారు.

### దేవుడి ఆశీస్సులే: పొంగులేటి

ఈ ఆసక్తికర ఘటనకు సంబంధించిన వీడియోను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పంచుకున్నారు. పేదల సొంతింటి కలను తీర్చాలన్న ప్రభుత్వ సంకల్పానికి దేవుడి ఆశీస్సులు కూడా తోడైనట్లుగా ఈ ఘటన ఉందని పేర్కొన్నారు. "ఇలాంటి సందర్భాలు చాలా అరుదు. చిన్నపిల్లలు దేవుళ్లతో సమానం. స్వచ్ఛమైన మనసున్న ఆ చిన్నారి తీసిన లక్కీడ్రాలో వారి కుటుంబానికే టోకెన్ రావడం ఆనందానికి, ఆశ్చర్యానికి గురిచేసింది. దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి సొంతింటి కల నెరవేరుతోంది. ఆ కుటుంబం కొత్త ఇంట్లో జీవితాంతం చల్లగా ఉండాలని కోరుకుంటున్నా" అని పొంగులేటి పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఇళ్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఇళ్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి, అనంతరం క్షేత్రస్థాయిలో తుది పరిశీలన నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలో అర్హులకు అవకాశం కల్పిస్తామని వివరించారు. కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లోనూ లక్కీడ్రా నిర్వహించారు. తొలి దఫాలో 7,350 ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమంలో పాల్గొన్న పొంగులేటి.. కులం, మతం, రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా ఇళ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా అత్యంత విలువైన ప్రభుత్వ భూముల్లోనూ ఇళ్లను నిర్మించి అందిస్తామని చెప్పారు. మరో పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితాను విడుదల చేస్తామన్నారు. 16 నియోజకవర్గాల్లో అవసరమైన స్థలాలను సేకరించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో టవర్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని, అక్కడ ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోమని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇంటిని తాకట్టు పెట్టుకునే అవకాశం ఉంటుందని, పదేళ్ల తర్వాత విక్రయించుకునే హక్కు కూడా లబ్ధిదారులకు ఉంటుందని వెల్లడించారు.

# నేరాలపై ‘టెక్’ నిఘా పెంచాలి

- పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి: డీజీపీ సీవీ ఆనంద్
- గణాంకాలకే పరిమితం కాకుండా నేరం వెనుక కారణాలనూ విశ్లేషించాలి
- రాష్ట్రంలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు
- మాదకద్రవ్యాల కేసుల్లో 46.10 శాతం పెరుగుదల
- సైబర్, ఆర్థిక, తీవ్ర నేరాల్లో తగ్గుదల




**హైదరాబాద్, ఆగస్టు 28:** నేర నియంత్రణలో సాంకేతికతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. నేర సమీక్షలను కేవలం కేసుల సంఖ్య, గణాంకాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థులు అనుసరిస్తున్న విధానం, దర్యాప్తు తీరు, కేసుల పరిష్కారాన్ని సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిట్ల ఉన్నతాధికారులతో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్రంలో నేరాల పరిస్థితి, దర్యాప్తు, సాంకేతికత వినియోగం, మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలు, సైబర్, ఆర్థిక నేరాలపై విస్తృతంగా సమీక్షించారు. రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగినట్లు డీజీపీ వెల్లడించారు. 2023--24లో 2,65,377 కేసులు నమోదు కాగా.. 2025-26 నాటికి 2,84,363కు చేరాయని తెలిపారు. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కు పెరిగిందన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులు 2023-24లో 2,026 ఉండగా.. 2025-26లో 2,960కు చేరాయని తెలిపారు. ఈ కేసుల్లో 46.10 శాతం పెరుగుదల నమోదైందన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణపై మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వ్యవస్థీకృత నేరాలకు సంబంధించిన కేసులు 25 నుంచి 451కు పెరిగాయని, 1,704 శాతం పెరుగుదల నమోదైనట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు పెరిగి 9.48 శాతం వృద్ధి చెందినట్లు వివరించారు. మరోవైపు కొన్ని విభాగాల్లో నేరాలు తగ్గినట్లు డీజీపీ తెలిపారు. సైబర్ నేరాలు 25,373 నుంచి 22 వేలకు తగ్గి 13.29 శాతం క్షీణించాయని చెప్పారు. ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు తగ్గి 13.28 శాతం క్షీణించినట్లు వెల్లడించారు. తీవ్ర నేరాల్లోనూ 10.33 శాతం తగ్గుదల నమోదైందన్నారు. సాంకేతికతను నేర నియంత్రణకు ప్రధాన సాధనంగా మార్చుకోవాలని డీజీపీ సూచించారు. ఇటీవల సీసీటీఎన్ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గతంలో 70 నుంచి 80 శాతంగా ఉన్న సమాచార నవీకరణ.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీయమన్నారు. ప్రతి యూనిట్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రాథమిక పోలీసింగ్ విధానాలను పకడ్బందీగా అమలు చేయాలని, వృత్తిపరమైన ప్రమాణాల అమలును అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై తనిఖీ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించాలని డీజీపీ ఆదేశించారు. జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించిన లోపాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మారుతున్న నేర ధోరణులను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీజీ (శాంతిభద్రతలు) మహేశ్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, మహిళా భద్రత విభాగం డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యాతో పాటు రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డారు!

- కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయారు
- రేషన్ కార్డుపై మోదీ ఫొటో ఏది?
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- ఇందిరమ్మ ఇళ్లలో పక్షపాతమంటూ ఫైర్
- కేంద్ర నిధులతోనే అభివృద్ధి అంటూ వ్యాఖ్య
- సీఎస్‌తో రైల్వే సమస్యలపై చర్చ




**హైదరాబాద్, ఆగస్టు 28:** “కేసీఆర్ పాలన వద్దని కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు ఓటేశారు. కానీ ఇప్పుడు వారి పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయింది” అని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలన మాదిరిగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని, అవినీతి మరింత పెరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు, గృహ నిర్మాణం సహా పలు అంశాలపై చర్చించారు. అనంతరం సచివాలయం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోల సన్నబియ్యం అందిస్తుంటే రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో ఎందుకు వేయడం లేదని ఈటల ప్రశ్నించారు. “బియ్యం ఇచ్చేది కేంద్రమైతే మీ బొమ్మలెందుకు? ఇది ఎవరి జాగీరు?” అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇందిరమ్మ కమిటీల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కమిటీల పేరుతో అధికార పార్టీ నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కేంద్రానికి ఎలాంటి వివక్ష లేదని, రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దానికంటే గత మూడేళ్లలో రూ.100 కోట్లు అధికంగానే కేంద్రం ఇచ్చిందని పేర్కొన్నారు. ఢిల్లీకి వెళ్లినప్పుడు కేంద్రం ఆశీర్వాదం, మద్దతు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరుతున్నారని, తెలంగాణకు వచ్చాక మాత్రం ప్రధాని మోదీపై విమర్శలు చేస్తున్నారని ఈటల అన్నారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాభివృద్ధి ఉందన్న విధానంతో కేంద్రం పనిచేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయని చెప్పారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ కేంద్రంతో ఘర్షణాత్మక వైఖరి అనుసరించారని ఈటల విమర్శించారు. ప్రధానమంత్రిని గౌరవించకుండా వ్యవహరించడం రాష్ట్ర ప్రయోజనాలకు మంచిది కాదన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈటల తెలిపారు. వీటి నిర్మాణంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. కేంద్రం సహకరించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా అవసరమైన సహకారం ఉండాలని కేంద్ర మంత్రి సూచించినట్లు తెలిపారు. ఇదే అంశాన్ని సీఎస్ సంజయ్ జాజు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ల అభివృద్ధికి అమృత్ పథకం కింద రూ.22 కోట్లు కేంద్రం అందిస్తోందని ఈటల పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ల రూపురేఖలను మార్చేందుకు కేంద్రం చర్యలు చేపడుతోందన్నారు. మేడ్చల్, సికింద్రాబాద్ పరిధిలోని రైల్వే గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణంపైనా దృష్టి సారించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో పట్టణ, గ్రామీణ గృహ నిర్మాణ పథకాల పనులను వేగవంతం చేయాలని సీఎస్‌ను కోరినట్లు ఈటల వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తే కేంద్ర పథకాలు, రైల్వే ప్రాజెక్టులను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.

# మంత్రి పొన్నంకు ‘సర్’ నోటీసు!

- ఓటరు జాబితాలో తండ్రి పేరు తప్పు
- సవరణ కోసం నోటీసిచ్చిన బీఎల్వో
- వెంటనే పత్రాలు సమర్పించిన మంత్రి
- ‘సర్’ ప్రక్రియలో భాగంగానే నోటీసు
- ఇంటింటా వివరాలు సరిచూస్తున్న అధికారులు



**హైదరాబాద్, ఆగస్టు 28:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నికల అధికారులు నోటీసు జారీ చేశారు. ఓటర్ల జాబితాలో ఆయన తండ్రి సత్తయ్య గౌడ్ పేరు తప్పుగా నమోదు కావడంతో సవరణ కోసం బూత్ స్థాయి అధికారి స్వయంగా మంత్రిని కలిసి నోటీసు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అధికారులు ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంబంధించిన ఓటరు వివరాలను పరిశీలించగా ఆయన తండ్రి పేరులో తప్పు ఉన్నట్లు గుర్తించారు. దీంతో నిబంధనల ప్రకారం సవరణకు అవసరమైన ఆధారాలు సమర్పించాలని నోటీసు ఇచ్చారు. నోటీసు అందుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించారు. తన తండ్రి పేరును సరిచేసేందుకు అవసరమైన ధ్రువపత్రాలను బూత్ స్థాయి అధికారికి అందజేశారు. వాటిని పరిశీలించిన అనంతరం ఓటర్ల జాబితాలో పేరు సవరణ ప్రక్రియ చేపట్టనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాల్లో తప్పులు, వివరాల్లో వ్యత్యాసాలను గుర్తించి సరిచేసేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతున్నారు. ఇందులో భాగంగానే సాధారణ ఓటర్ల మాదిరిగా మంత్రికి కూడా నోటీసు అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు.



# గవర్నర్‌ను పరామర్శించిన భట్టి

ఆరోగ్యంపై ఆరా తీసిన సిఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్, ఆగస్ట్ 28:** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ ని శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా గవర్నర్‌ను వేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీసారు.



# కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ‘వారం పోరు’

- వెయ్యి రోజుల పాలనపై చార్జిషీట్
- సెప్టెంబర్ 2 నుంచి వరుస నిరసనలు
- ఆరు గ్యారంటీలపై ఇంటింటికీ ప్రచారం
- రైతు, మహిళ, యువత సమస్యలపై పోరు
- పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్, ఆగస్టు 28:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, అసమర్థ పాలనను ఎండగట్టేందుకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు (కేటీఆర్) పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసిన ఆయన, వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు దాటినా ప్రధాన హామీలను పక్కనబెట్టారని ఆరోపించారు. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 1న తెలంగాణ భవన్‌లో చార్జిషీట్ విడుదల చేయడంతో పాటు, ‘420 హామీల మోసం’పై ప్రచారాలు, బాకీ కార్డుల పంపిణీ ద్వారా కాంగ్రెస్ నమ్మకద్రోహాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ కార్యాచరణలో భాగంగా సెప్టెంబర్ 2న ఆరు గ్యారెంటీల వైఫల్యంపై నియోజకవర్గాల్లో ధర్నాలు, సెప్టెంబర్ 3న సాగునీరు, విద్యుత్, 22ఏ భూముల సమస్యలపై రైతు సదస్సులు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 4న మహిళలకు రూ.2,500 సాయం, సంక్షేమ పథకాల అమలుపై సదస్సులు, వంటా-వార్పు నిరసనలు చేపడతారు. అలాగే సెప్టెంబర్ 5న ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, సింగరేణి సమస్యలపై యువతతో ర్యాలీలు ప్లాన్ చేశారు. సెప్టెంబర్ 6న నగరంలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై ఆటోలతో భారీ ర్యాలీ, సెప్టెంబర్ 7న జిల్లా ‘ప్రజావాణి’ కేంద్రాల్లో వినతిపత్రాల సమర్పణ ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్ 8న జిల్లా ప్రెస్‌మీట్లు, సీనియర్ నేతల సమన్వయంతో ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# నార్సింగ్‌లో హిట్ అండ్ రన్

- డెలివరీ బాయ్ బైకును ఢీకొట్టి పరార్
- ప్రమాదంలో డెలివీర బాయ్ అక్కడిక్కడే మృతి






**హైదరాబాద్, ఆగస్ట్ 28:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నార్సింగి ప్రధాన రహదారిపై చోటుచేసుకున్న హిట్ అండ్ రన్ ప్రమాదంలో ఒక డెలివరీ బాయ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వేగంగా వచ్చిన ఒక గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడమే కాకుండా, వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారైంది. హైదరాబాద్ గోల్కొండ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ సమద్ అనే యువకుడు ’ఫస్ట్ క్లబ్’ సంస్థలో డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల నిర్వహణలో భాగంగా నార్సింగి నుండి గండిపేట వైపు ఆర్డర్ డెలివరీ తీసుకొని బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మితిమీరిన వేగంతో వెనుక నుండి వచ్చిన అపరిచిత వాహనం సమద్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఆ దెబ్బకు బైక్ అదుపుతప్పి ఫుట్‌పాత్‌పై పడటంతో సమద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు తక్షణమే అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, డ్రైవర్‌ను గుర్తించేందుకు రహదారిపై ఉన్న సిసిటీవీ ఫుటేజ్‌ను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని అధికారులు తెలిపారు.

# చెస్ మాస్టర్ ప్రజ్ఞానందకు సీఎం రేవంత్ అభినందనలు




**హైదరాబాద్, ఆగస్ట్ 28:** అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుని, చరిత్ర సృష్టించిన భారత చెస్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారత ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజ్ఞానంద విజయం ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ప్రజ్ఞానంద విజయం క్రీడాకారులకు, యువతీయువకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజ్ఞానంద మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

## సంపాదకీయం



# కాంగ్రెస్‌లో 'కలుపు మొక్కలు'!

### రేవంత్ నాయకత్వాన్ని జీర్ణించుకోలేని సొంత నేతలు

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు కొత్తేమీ కాదు. ఇవే మొదలు కాదు.. ఇవే చివరివీ కావు. అధికారం ఉంటే ఒకరకమైన కొట్లాట.. లేకుంటే మరోరకమైన కొట్లాట. మొత్తంగా చూస్తే ఇవన్నీ ఆధిపత్య పోరులో భాగమే. ఒకరంటే ఒకరికి పడదు. మరొకరంటే ఇంకొకరికి గిట్టదు. ప్రజల పేరు, పథకాల పేరు చెప్పి ప్రచారాలు చేసుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై సమయం వెచ్చించే నేతలు ఎంతమంది ఉన్నారన్న ప్రశ్న మాత్రం మిగిలిపోతోంది. తాజా పరిణామాలను పరిశీలిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని కాంగ్రెస్‌లోని కొందరు నేతలు ఇప్పటికీ పూర్తిగా జీర్ణించుకోలేకపోతున్నారన్న అభిప్రాయం బలపడుతోంది. రేవంత్‌రెడ్డి తెలుగుదేశం నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చారన్న విషయాన్నే పదేపదే గుర్తుచేసుకునే వారు.. ఆయన నాయకత్వంలోనే పార్టీ అధికారంలోకి వచ్చిందన్న రాజకీయ వాస్తవాన్ని అంగీకరించడానికి మాత్రం వెనుకాడుతున్నారు. అందుకే అడపాదడపా అసంతృప్తి బయటపడుతోంది. తాము ఉన్నామని నిరూపించుకునేందుకు కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు చివరకు పార్టీనే ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. మంత్రి కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు కాంగ్రెస్‌లో చర్చకు కేంద్రంగా మారింది. దేవాదాయ శాఖ మంత్రిగా ఆలయాల సమస్యలు, అర్చకుల ఇబ్బందులు, ధూపదీప నైవేద్యాలు, అన్యాక్రాంతమైన దేవాలయ భూముల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో వేలాది ఎకరాల ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయన్న ఆరోపణలు ఏళ్లుగా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ ఇలాంటి సమస్యలు అనేకం ఉన్నాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట చెన్నకేశవస్వామి ఆలయ భూములు, జీడికల్, కొండాపూర్ ప్రాంతాల్లోని ఆలయ భూముల వ్యవహారాలు ఉదాహరణలుగా కనిపిస్తున్నాయి. వీటిపై సమగ్ర చర్యలు తీసుకుంటేనే దేవాదాయ శాఖ పనితీరు ప్రజలకు కనిపిస్తుంది. అటవీ శాఖలోనూ ఇదే పరిస్థితి. మొక్కలు నాటడం మాత్రమే కాదు.. వాటిని బతికించి పచ్చదనం పెంచే కార్యాచరణ కనిపించాలి. పొరుగున ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక వనాల పెంపుపై చర్చ జరుగుతున్న సమయంలో తెలంగాణలో వన మహోత్సవ కార్యక్రమాలు మరింత విస్తృతంగా, ఫలితాల ఆధారంగా సాగాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతలపై దృష్టి కేంద్రీకరించాల్సిన సమయంలో రాజకీయ వివాదాలు తెరపైకి రావడం ప్రభుత్వానికీ, కాంగ్రెస్‌కూ ఇబ్బందికరమే. ముఖ్యమంత్రిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు పార్టీలో క్రమశిక్షణపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తాయి. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా చిన్నారెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రజావాణికి వస్తున్న ప్రధాన సమస్యలేమిటి? వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయి? ప్రభుత్వ ప్రణాళికల్లో వాటి ప్రభావం ఎంత? అన్న అంశాలపై ప్రజలకు స్పష్టత రావాలి. మరోవైపు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవిపై తన ఆకాంక్షను బహిరంగంగానే వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఇలాంటి పరిణామాలన్నీ కలిసి పాలనకన్నా పదవులు, ఆధిపత్యమే ముఖ్యమా అన్న సందేహాన్ని ప్రజల్లో కలిగిస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు అధికారంలోకి రావడానికి దాదాపు పదేళ్లు పట్టింది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఏర్పడిన ప్రజా వ్యతిరేకత వాటిలో ప్రధానమైనది. అదే సమయంలో కేసీఆర్‌కు ప్రత్యామ్నాయంగా తాను నిలబడగలనన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించడంలో రేవంత్‌రెడ్డి విజయవంతమయ్యారు. ఈ రాజకీయ వాస్తవాన్ని కాంగ్రెస్ నేతలు విస్మరించకూడదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌లో బలమైన నాయకత్వాన్ని నెలకొల్పగలిగారు. ఆయన నాయకత్వంలో సీనియర్ నేతలు సైతం పార్టీ గీత దాటేందుకు వెనుకాడేవారు. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో అలాంటి క్రమశిక్షణ కనిపించడం లేదన్న విమర్శ ఉంది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి తన నాయకత్వంపై పూర్తిస్థాయి పట్టు సాధించాలంటే ప్రభుత్వ పనితీరుతో పాటు పార్టీలో క్రమశిక్షణను కూడా నెలకొల్పాల్సి ఉంటుంది. జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య వంటి సీనియర్ నేతలు పార్టీలు మారినా రాజకీయ వ్యవస్థ ఆగిపోలేదు. వ్యక్తులకన్నా పార్టీ, ప్రభుత్వ ప్రయోజనాలే ముఖ్యమన్న సందేశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ఇవ్వాలి. ఎవరు ఎంతటి వారైనా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఒకే ప్రమాణం వర్తిస్తుందన్న నమ్మకం కలిగించాలి. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు, మంత్రి కొండా సురేఖ కుటుంబం నుంచి వచ్చిన విమర్శలు.. ఇలా ఒకరి తర్వాత మరొకరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుంటూ పోతే ఈ జాబితా పెరుగుతుందే తప్ప తగ్గదు. నాయకత్వంపై అభిప్రాయభేదాలు ఉండొచ్చు. వాటిని పార్టీ వేదికల్లో చర్చించుకోవచ్చు. కానీ బహిరంగ విమర్శలు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయి. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది నేతల అంతర్గత గొడవలను చూడటానికి కాదు. మెరుగైన పాలన, అవినీతికి అడ్డుకట్ట, ఉపాధి, రైతు సంక్షేమం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల్లో మార్పు కోసం. క్షేత్రస్థాయిలో అవినీతి, పర్సంటేజీల ఆరోపణలు వినిపిస్తున్న సమయంలో అధికార పార్టీ నేతల పరస్పర విమర్శలు ప్రజల్లో మరింత ప్రతికూల భావనను పెంచుతాయి. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం విశ్వసించి పీసీసీ బాధ్యతలు అప్పగించింది. కేసీఆర్‌ను రాజకీయంగా దీటుగా ఎదుర్కోగల నాయకుడిగా ఆయనను ముందుకు తెచ్చింది. ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో రేవంత్ పాత్రను విస్మరించలేం. అదే సమయంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన పాలన అందించడం ముఖ్యమంత్రి ఒక్కరి బాధ్యత కాదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలందరికీ అందులో భాగస్వామ్యం ఉంది. కాంగ్రెస్‌కు ఇప్పుడు కావాల్సింది సొంత నేతల మధ్య మాటల యుద్ధం కాదు.. పాలనపై పోటీ. ఎవరు ప్రజలకు ఎక్కువ మేలు చేశారన్న పోటీ ఉండాలి. ఎవరు ముఖ్యమంత్రిని ఎక్కువగా ఇబ్బంది పెట్టారన్న పోటీ కాదు. పార్టీకి భారంగా మారే 'కలుపు మొక్కలను' గుర్తించి క్రమశిక్షణతో వ్యవహరించకపోతే.. ఆ కలుపు చివరకు కాంగ్రెస్ పంటనే దెబ్బతీసే ప్రమాదం ఉంది.

# నేపాల్ వరదల్లో 1,400 మందికి పైగా గల్లంతు

- గల్లంతైన వారి జాబితాను విడుదల చేసిన నేపాల్ పోలీసులు
- 178 మంది భారతీయులు సహా 644 మంది వివరాల వెల్లడి
- సుమారు 320 మంది భారతీయుల ఆచూకీ లేదన్న విదేశాంగ శాఖ
- చైనాలో చిక్కుకున్న 400 మంది భారతీయులు క్షేమం
- మృతులు, గల్లంతైన వారి పూర్తి వివరాలపై కొనసాగుతున్న అన్వేషణ





**ఖాట్మండు, ఆగస్టు 28:** నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన భారీ వరదల్లో గల్లంతైన వారి వివరాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ విపత్తులో ఇప్పటివరకు 552 మంది మరణించినట్లు సమాచారం. వీరిలో 547 మంది మృతుల వివరాలను నేపాల్ ప్రకటించగా, మరో ఐదుగురి మరణాల గురించి చైనా మీడియా వెల్లడించింది. 1,400 మందికి పైగా గల్లంతైనట్లు సమాచారం ఉండగా.. వారిలో 178 మంది భారతీయులు సహా 644 మంది వివరాలతో నేపాల్ పోలీసులు జాబితాను విడుదల చేశారు. గల్లంతైన వారిలో భారతీయులతో పాటు ఇతర దేశాలకు చెందిన వారు కూడా ఉన్నట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. సహాయక బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. అయితే మృతులు, గల్లంతైన వారి సంఖ్యపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

### 320 మంది భారతీయుల ఆచూకీ లేదు


నేపాల్‌లో సుమారు 320 మంది భారతీయుల ఆచూకీ తెలియడం లేదని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. మరో వంద మంది భారత సంతతి వ్యక్తుల ఆచూకీ కూడా తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. వారి వివరాలను గుర్తించేందుకు నేపాల్ అధికారులతో భారత రాయబార కార్యాలయం సమన్వయం చేస్తోందని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న తమిళనాడుకు చెందిన 21 మంది సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నట్లు వెల్లడించారు. త్రిశూలీ విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 63 మంది భారతీయులు క్షేమంగానే ఉన్నారని తెలిపారు.

### చైనాలో 400 మంది క్షేమం

వరదల కారణంగా చైనా భూభాగంలో నిలిచిపోయిన సుమారు 400 మంది భారతీయులు కూడా సురక్షితంగానే ఉన్నారని విదేశాంగ శాఖ తెలిపింది. వారిలో చాలామంది సహాయవాణి ద్వారా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించినట్లు పేర్కొంది. వీరిలో 96 మంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారని, వారిని భారత్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రణధీర్ జైస్వాల్ తెలిపారు. మిగిలిన భారతీయులను కూడా సురక్షితంగా తరలించేందుకు అక్కడి అధికారులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు ఇంకా పూర్తిగా సాధారణ స్థితికి రాకపోవడంతో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతులు, గల్లంతైన వారి సంఖ్యపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

# సోనియా ఆత్మకథపై 'ప్రచురణ' రగడ

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్' ప్రచురణ వ్యవహారం రాజకీయ వివాదంగా మారుతోంది. ఈ పుస్తకానికి తాము ప్రచురణకర్తలం కాదంటూ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా చేసిన ప్రకటనపై కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పుస్తకంలోని ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్‌ఎస్‌ఎస్, భారత్-చైనా సరిహద్దుకు సంబంధించిన కొన్ని అంశాల్లో మార్పులు చేయాలని ప్రచురణ సంస్థ కోరిందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. సోనియా గాంధీ తన ఆత్మకథలో సంపాదకీయ మార్పులకు అంగీకరించకపోవడంతోనే పెంగ్విన్ ఇండియా ప్రచురణ నుంచి వెనక్కి తగ్గిందంటూ వచ్చిన వార్తలపై ఆ సంస్థ స్పందించింది. ఆ కథనాల్లో నిజం లేదని పేర్కొంటూ వివరణ విడుదల చేసింది. 'బిలాంగింగ్' పుస్తకానికి తాము ప్రచురణకర్తలం కాదని స్పష్టం చేసింది. అదే సమయంలో పుస్తకాన్ని ప్రచురించే విషయంలో తమకు ఇప్పటికీ ఆసక్తి ఉందని పేర్కొంది. ప్రచురణ ప్రక్రియలో భాగంగా రచనలోని అంశాలను పరిశీలించడం, అవసరమైన సంపాదకీయ మార్పులను సూచించడం ప్రచురణకర్త బాధ్యతల్లో భాగమేనని వివరించింది. ఈ వ్యవహారంలో తమపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేసింది.




### పెంగ్విన్ వివరణపై కాంగ్రెస్ ఫైర్

పెంగ్విన్ ఇండియా ప్రకటన తర్వాత కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ స్పందిస్తూ.. ఈ పరిణామాన్ని ప్రజాస్వామ్యం, వ్యక్తి స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగించే పరిస్థితులు ఆందోళనకరమని విమర్శించారు. కాంగ్రెస్ నేత గౌరవ్ గొగొయ్ సైతం పెంగ్విన్ ఇండియా వివరణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంస్థ విడుదల చేసిన ప్రకటన బలహీనంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మరోవైపు మోదీ, ఆర్‌ఎస్‌ఎస్, భారత్-చైనా సరిహద్దుకు సంబంధించిన అంశాల్లో కోతలు లేదా మార్పులు చేయాలని పెంగ్విన్ కోరిందన్నది కాంగ్రెస్ నేతల ఆరోపణ మాత్రమే. ప్రచురణ సంస్థ మాత్రం తమపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేయడంతో సోనియా ఆత్మకథ 'బిలాంగింగ్' ప్రచురణ వ్యవహారం ఇప్పుడు రాజకీయ, భావప్రకటనా స్వేచ్ఛ చర్చకు కేంద్రంగా మారింది.

# మోడల్ హత్య కేసు

### పోలీసుల ఎన్‌కౌంటర్‌లో పట్టుబడ్డ నిందితుడు..

- పోలీసుల కాల్పుల్లో గాయపడిన జిమ్ ట్రైనర్
- రాజౌరీ గార్డెన్‌లో పట్టుకునే ప్రయత్నంలో పోలీసులపై కాల్పులు
- ఎదురు కాల్పుల్లో గాయపడటంతో ఆస్పత్రికి తరలింపు





**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** ఢిల్లీ మోడల్ హత్య కేసులో నిందితుడైన జిమ్ ట్రైనర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం రాత్రి ఎన్‌కౌంటర్ తర్వాత అతడిని అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. ఢిల్లీలోని తిలక్‌నగర్‌కు చెందిన 21 ఏళ్ల ముస్కాన్ అనే యువతి మోడలింగ్ చేస్తోంది. ఆమెకు ఇమ్రాన్ అనే జిమ్ ట్రైనర్‌తో ఏడాదిన్నర క్రితం పరిచయం అయింది. ముస్కాన్ వేరే యువకుడితో మాట్లాడుతుండటంతో ఇమ్రాన్ తట్టుకోలేకపోయాడు. ఇమ్రాన్ బుధవారం సాయంత్రం తిలక్‌నగర్‌లోని ముస్కాన్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. అక్కడ ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన ఇమ్రాన్.. ముస్కాన్‌పై కత్తితో దాడి చేశాడు. అతి కిరాతకంగా ఆమెను 21 సార్లు పొడిచాడు. దీంతో ముస్కాన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఇమ్రాన్ అక్కడినుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసు బృందాలు ఇమ్రాన్ కోసం గాలింపు చర్యలు ప్రారంభించాయి. గురువారం రాత్రి రాజౌరీ గార్డెన్ ఏరియాలో ఇమ్రాన్ పోలీసుల కంటబడ్డాడు. పోలీసులు అతడిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే ఇమ్రాన్ తన దగ్గర ఉన్న తుపాకితో పోలీసులపై కాల్పులకు తెగబడ్డాడు. పోలీసులు ఎదురు కాల్పులు జరపటంతో అతడి కాళ్లకు గాయాలు అయ్యాయి. గాయపడ్డ ఇమ్రాన్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత అతడిని కోర్టులో హాజరుపరచనున్నారు.

# ల్యాండింగ్‌లో పేలిన టైర్

## త్రుటిలో తప్పిన ముప్పు

### ఢిల్లీ-బిలాస్‌పూర్ అలయన్స్ విమానంలో ఘటన

### 37 మంది ప్రయాణికులు సహా 41 మంది సురక్షితం

**రాయ్‌పూర్, ఆగస్టు 28:** ఢిల్లీ నుంచి బిలాస్‌పూర్‌కు వచ్చిన అలయన్స్ విమానానికి శుక్రవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ విమానాశ్రయంలో ల్యాండింగ్ సమయంలో విమానం టైర్ ఒక్కసారిగా పేలింది. అప్రమత్తమైన పైలట్ చాకచక్యంగా వ్యవహరించి విమానాన్ని అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన సమయంలో విమానంలో మొత్తం 41 మంది ఉన్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. వీరిలో 37 మంది ప్రయాణికులు కాగా, నలుగురు సిబ్బంది ఉన్నారు. టైర్ పేలినప్పటికీ విమానంలోని ప్రయాణికులు, సిబ్బందిలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. విమానాన్ని సురక్షితంగా నిలిపిన అనంతరం ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. ఘటన నేపథ్యంలో విమానాన్ని తనిఖీల కోసం నిలిపివేశారు. దీంతో బిలాస్‌పూర్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన విమాన సర్వీస్‌ను రద్దు చేసినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు.



# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం..



**దమ్మపేట, ఆగష్టు 28, :** వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని ప్రజా ప్రెస్ క్లబ్ కోశాధికారి, నీలం వార్త పాత్రికేయురాలు నీలం రాజేశ్వరి తన నివాసంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పూజా సామగ్రితో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. అనంతరం సర్పంచ్ పగడాల రమాదేవి కి సంప్రదాయ బద్ధంగా వాయనం అందించి వరలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు దమ్మపేట గ్రామస్తులకు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ వరలక్ష్మి వ్రతం ప్రతి మహిళకు ఎంతో పవిత్రమైనదని, కుటుంబంలో సిరి సంపదలు, సుఖ సంతోషాలు వెల్లివిరియాలని అమ్మవారిని కొలుస్తారు అని తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, మహిళలు, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, బుర్రి రామలక్ష్మి , రాచూరి వరలక్ష్మి , దండా బత్తుల రోజా, ఎడవల్లి దివ్య, గొర్రెపాటి పావని, ఉయ్యాల రామలక్ష్మి , రొయ్యల శ్రీదేవి, షేక్ షహనాజ్ బేగం పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా రాఖీ పౌర్ణమి

**హరీష్ రావుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన మహిళా నాయకులు**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, :**



రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుకు మాజీ మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సుతో పాటు పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు రాఖీ కట్టి ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మహిళా నాయకులు ఆకాంక్షించారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు ఈ సందర్భంగా ఆత్మీయత, అభిమానంతో సందడిగా సాగాయి. మహిళా నాయకులు రాఖీలు కడుతున్న సమయంలో హరీష్ రావు వారితో ఆప్యాయంగా మాట్లాడి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల అభిమానానికి, ఆప్యాయతకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా చోటుచేసుకున్న ఈ ఆత్మీయ కలయిక పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. అన్నగా హరీష్ రావుపై మహిళా నాయకులు, కార్యకర్తలు చూపిన అభిమానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# మంత్రి శ్రీహరి నివాసంలో ఘనంగా 'రక్షాబంధన్' వేడుకలు



**హైదరాబాద్ బ్యూరో, ఆగష్టు 28, :** హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి నివాసంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి తోబుట్టువులు ఆయనకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి శ్రీహరి సంతోషంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధాలకు ప్రతీక అని, తోబుట్టువుల మధ్య అనురాగం, ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు మంత్రికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# కళాకారుల ఐక్యతే బలం.. హక్కుల సాధనే లక్ష్యం..

- **ఆగస్టు 30న భూపాలపల్లిలో సకల కళాకారుల సంగ్రామ భేరి**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, :** సకల కళాకారుల సమస్యల పరిష్కారం, జానపద కళల పరిరక్షణ కోసం ఆగస్టు 30న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి కళాకారుల సంగ్రామ భేరి సదస్సు నిర్వహిస్తున్నట్లు సకల కళల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. సిద్దిపేట పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. సకల కళాకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నేలపై పుట్టిన జానపద కళలు మన సంస్కృతికి ఊపిరి, పల్లెలకు ప్రాణమని అన్నారు. అయితే వేలాది మంది జానపద కళాకారులు నేటికీ గుర్తింపు, గౌరవం, ఉపాధి, భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. జానపద కళాకారులకు సముచిత గౌరవం, గుర్తింపు కల్పించడంతో పాటు వారి సంక్షేమం, కళల పరిరక్షణకు శాశ్వత వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడం శుభపరిణామమని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సకల కళల జేఏసీ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 13 సంవత్సరాలు గడిచినా జానపద కళల పరిరక్షణ, అభివృద్ధి, కళాకారుల సంక్షేమం కోసం ప్రత్యేక జానపద అకాడమీ లేదా జానపద విశ్వవిద్యాలయం ఏర్పాటు కాలేదని అన్నారు. అంతరించిపోతున్న జానపద కళలను కాపాడేందుకు, కళాకారుల జీవనోపాధికి భరోసా కల్పించేందుకు తెలంగాణ జానపద అకాడమీ, జానపద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సదస్సులో వివిధ కళారూపాల ప్రదర్శనలు, కళాకారుల ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాకారుల ఐక్యతే తమ బలమని, హక్కుల సాధనే లక్ష్యమని పేర్కొంటూ రాష్ట్రంలోని సకల కళాకారులు పెద్ద సంఖ్యలో భూపాలపల్లికి తరలిరావాలని సుభాష్ చంద్రబోస్ కోరారు.

# శ్రావణ మాసం అమ్మవారికి.. ఆడపడుచులకు ప్రత్యేకం..

- **అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి**
- **ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, :** శ్రావణ మాసం అమ్మవారికి, ఆడపడుచులకు ఎంతో పవిత్రమైన మాసమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాఖీ పౌర్ణమి, శ్రీ సంతోషిమాత అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని శ్రీ సంతోషిమాత దేవాలయాన్ని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆడపడుచులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సంతోషిమాత అమ్మవారి జన్మదినం రోజున అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమన్నారు. శ్రావణ మాసం అమ్మవారికి, ఆడపడుచులకు ఎంతో పవిత్రమైనదని, ఈ మాసంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించడం విశేషమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ ఈఓ హరీశ్‌రావుకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ఉద్యాపన పూజ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు.



# చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల గడువు 31 వరకు

**సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 28, :** చేయూత పథకం కింద కొత్త సామాజిక భద్రతా పింఛన్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 31వ తేదీ చివరి గడువని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి తెలిపారు. అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన చేయూత సామాజిక భద్రత కొత్త పింఛన్ల మంజూరు–2026కు సంబంధించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులు, ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు చేయూత అందించేందుకు కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం గ్రామీణ ప్రాంతాల వారు తమ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శికి లేదా ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల వారు వార్డు అధికారులకు లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌డీవో రమేష్, అడిషనల్ డీఆర్‌డీఏ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



# రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న పులిమామిడి రాజు

**సదాశివపేట, ఆగస్టు 28, :** సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో రాఖీ పౌర్ణమి వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని సందడి చేశారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదర–సోదరీమణుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను కుటుంబ సభ్యుల సమక్షంలో ఆనందంగా జరుపుకున్నారు. మొదటగా పులిమామిడి మాధవి తన సోదరుడు మనోజ్ కు రాఖీ కట్టి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కుటుంబ సభ్యుల ఆప్యాయతలు, ఆనందోత్సాహాల నడుమ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి.ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ, రాఖీ పౌర్ణమి సోదర–సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని అన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి పండుగలను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని, సోదర–సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు ఎల్లప్పుడూ నిలిచి ఉండాలని కోరుకుంటూ ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పులిమామిడి మమత,



మనోజ్, ప్రవీణ్, మాధవి, అంజమ్మ, పిఎంఆర్ యువసేన నాయకులు రాగం అనిల్, గుణాకర్, అఖిల్, రాము, సోమ శంకర్ మొదలగు వారు పాల్గొన్నారు.

# రక్షాబంధన్ సందర్భంగా మంత్రికి రాఖీ కట్టిన సోదరీమణులు

- **శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, ఆగష్టు 28, :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ధర్మపురి క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని స్థానిక కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని సోదరీమణులు కలిసి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోదరీమణులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనం దాన్ని నింపాలని ఆకాంక్షించారు. సోదరీ మణుల ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలు తనకు ఎల్లప్పుడూ కొండంత అండగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు.



# బొంగునూరి శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన భూపతి రెడ్డి




**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 28, :** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి భూపతిరెడ్డి ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు సదానందం ముదిరాజ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, దూలపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బైరి శివకుమార్ గౌడ్, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, బౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకు రాలు లత, మల్లారెడ్డి తదితరులు పాల్గొని శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

**సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 28, :** జిల్లాలో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గృహనిర్మాణ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులను కూడా సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, నిబంధనల ప్రకారం అర్హులైన అసలైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను వారికి అందించాలని సూచించారు. ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లబ్ధిదారులకు అందించిన రెండు పడక గదుల ఇళ్లకు విద్యుత్, తాగునీరు, సీసీ



రోడ్లు, సెప్టిక్ ట్యాంకులు తదితర మౌలిక వసతులను కల్పించాలని అధికారులకు సూచించారు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు గృహ నిర్మాణ శాఖ, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ భగవంత్ రావు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు శేరుపల్లి నరేష్ కు సన్మానం

- ప్రజా సమస్యల పరిష్కారానికి నరేష్ చేస్తున్న కృషి అభినందనీయం
- ఘనంగా సన్మానించిన ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**మిరుదొడ్డి, ఆగస్టు 28, :** జర్నలిస్టు వృత్తిలో అంకితభావంతో 19 సంవత్సరాలుగా సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్టు శేరుపల్లి నరేష్ ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శాలువాతో సన్మానించారు. శుక్రవారం అక్బర్ పేట-భూంపల్లి మండల కేంద్రంలోని బక్కి



వెంకటయ్య స్వగృహంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన గొంతుకగా ఉంటూ ప్రభుత్వానికి సమస్యలను తెలియ జేయడంలో జర్నలిస్టు నరేష్ ముందుంటారని కొనియాడారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయడంలో నరేష్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రతి జర్నలిస్టు ఆదర్శంగా ఉంటూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలని సూచించారు. నిస్వార్థంగా పనిచేసే జర్నలిస్టులకు ప్రజల అండదండలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్ పేట-భూంపల్లి మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం నివాసంలో ఘనంగా 'రాఖీ పౌర్ణమి' వేడుకలు

- మంత్రికి రాఖీలు కట్టిన మంత్రి సీతక్క, మహిళా నాయకులు

**హైదరాబాద్ బ్యూరో, ఆగస్టు 28, :** రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మంత్రి పొన్నం ప్రభాకర్, వారి కుటుంబ సభ్యులకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి సీతక్క రాఖీ కట్టి మంత్రి పొన్నం ప్రభాకర్ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళా కమిషన్ చైర్మన్, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మేకలు, గొర్రెల అభివృద్ధి సహకార చైర్మన్ సరిత తిరుపతయ్య యాదవ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ కి రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రాఖీలు కట్టిన సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాఖీ పౌర్ణమి పండుగ



కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

# చెంజర్లలో ట్రాక్టర్‌పై మగ్గం నేత

- రాఖీ పౌర్ణమి వేళ పద్మశాలల సంప్రదాయ కార్యక్రమం

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, :** రాఖీ పౌర్ణమి సందర్భంగా చెంజర్ల గ్రామంలో పద్మశాలీలు నిర్వహించే సంప్రదాయ ఆచారంలో భాగంగా ట్రాక్టర్‌పై మగ్గం నేత కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలీల వృత్తి, సంప్రదాయానికి ప్రతీకగా మగ్గాన్ని ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి నేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీలు సంప్రదాయ వస్త్రాలు, కండువాలు ధరించి



మగ్గం నేసే కార్యక్రమాన్ని చేపట్టారు. తమ కులవృత్తి, చేనేత సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమం గ్రామంలోని ప్రధాన పేదలకుండా గుట్టపై వెలసిన శివాలయం వరకు సాగింది. ట్రాక్టర్ పై అమర్చిన మగ్గంతో నేచిన వస్త్రాలను గ్రామంలోని హనుమాన్ గుడి, శివాలయం, గుట్ట శివాలయంలో దేవతా మూర్తులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లెన కొమరమ్మ కొమురయ్య, ఉప సర్పంచ్ గడ్డి గణేష్, వార్డు సభ్యులు, పద్మశాలి సంఘం నాయకులు ఎలగం రాజయ్య, భైరి వెంకటయ్య, ఎల్లయ్య రమేష్, రాములు, ఒడ్నాల ఓదెలు, సదానందం, మార్కండేయ, బొలబత్తుల ఆంజనేయులు, రాజు, గంగుల వెంకటేశ్వర్లు, వాసాల తిరుపతి, బాసబత్తుల వివేక్, రాజేశం, సంపత్, శ్రీరాముల భూమయ్య, నర్సయ్య, ఆడెపు కుమార్, సంపత్, రాజు, లక్ష్మీరాజం, దాసరి కొమురెల్లి, పనస సంపత్, రామ్మూర్తి, సుధాకర్, చంద్రాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దంపతులు

**జగిత్యాల ప్రతినిధి, ఆగస్టు 28, :** జగిత్యాల రూరల్ మండలం అంబారిపేటలో జరిగిన గిరి ప్రదక్షిణలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దంపతులు పాల్గొనడం జరిగింది. అంబారిపేట శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్ర సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించడం, స్వామివారిని పల్లకిలో తీసుకువచ్చి గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు అంబారిపేట గ్రామ ప్రజలపై, జగిత్యాల నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం ఇతర మతాలను గౌరవించడం మనందరి బాధ్యత. భక్తుల సౌకర్యాల కోసం ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటాను అన్నారు. ఈ గిరి ప్రదక్షిణలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ప్రతి



ఒక్కరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి కృపాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని కోరుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, ఉప సర్పంచ్ గంగాధర్, ఆలయ చైర్మెన్ మల్లేశం, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, బాల ముకుందం, ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, నోముల శేఖర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రాజి రెడ్డి, నారాయణ, గంగారెడ్డి, వెంకటేష్, చిరంజీవి, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ ప్రతీక

- మగ్దూమ్ నగర్ కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా రాఖీ ఉత్సవాలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 28, :** అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను మగ్దూమ్ నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన



కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్, మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ.. భారతదేశం స్నేహం, సంప్రదా యాలకు నిలయమని అన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఆప్యాయత, అనురాగానికి రాఖీ పండుగ నిదర్శనమని పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే గొప్ప సంప్రదాయమే రాఖీ పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, మంగా, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని రాఖీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

# మిరుదొడ్డిలో సామూహిక యజ్ఞోపవీత ధారణ



**మిరుదొడ్డి, ఆగస్టు 28, :** మిరుదొడ్డి మండలంలోని శ్రీ మార్కండేయ స్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం వైభవంగా జరిగింది. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెల్లవారుజాము నుండే పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు, భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. వేద పండితుల పర్యవేక్షణలో వేద మంత్రోచ్చారణల మధ్య నియమనిష్టలతో సభ్యులకు యజ్ఞోపవీత (జంధ్యం) ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ మార్కండేయ స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు రాఖీలు కట్టిన మహిళలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 28, :** రాఖీ పౌర్ణమి సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్‌తో పాటు ఆయన సోదరుడు, మేడ్చల్-మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్‌ను నియోజకవర్గానికి చెందిన మహిళలు శుక్రవారం పెద్ద సంఖ్యలో కలిసి రాఖీలు కట్టారు. షాపూర్‌నగర్‌లోని వారి నివాసానికి తరలివచ్చిన మహిళలు వారికి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని, ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్, శ్రీనివాస్ గౌడ్‌లకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాఖీలు కట్టడం పట్ల కూన శ్రీశైలం గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు. మహిళల అభిమానం, ఆప్యాయత తనకు ఎప్పటికీ ప్రత్యేకమని ఆయన పేర్కొన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు రక్షాబంధన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో మహిళలకు ప్రతి ఒక్కరూ గౌరవం, మర్యాద ఇవ్వాలని, మహిళల పాత్ర సమాజంలో ఎంతో కీలకమని శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పద్మ, లావణ్య, శ్యామల, సంగీత, అనితలతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాఖీ పౌర్ణమి సందర్భంగా భూపతి రెడ్డికి రాఖీ కట్టిన మహిళా కాంగ్రెస్ నాయకులు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 28, :** రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా కాంగ్రెస్ సభ్యులు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి భూపతి రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నాయకులు భూపతి రెడ్డి కి రాఖీ కట్టి, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను సోదరభావంతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ సభ్యులు పాల్గొని భూపతి రెడ్డి కి తమ ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు.

## రక్షాబంధన్ సందర్భంగా అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా రాఖీ వేడుకలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 28, :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డికి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి రాఖీ కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, అనురాగం, ఆప్యాయత, పరస్పర నమ్మకానికి



ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ సందర్భంగా వారు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా రక్షాబంధన్ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తూ, ప్రేమాభిమానాలను పెంపొందించాలని ఆకాంక్షించారు.

# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

- **అన్నా చెల్లెళ్ల అనుబంధానికి అపురూప వేడుక**
- **రాఖీలు కట్టుకొని ఆత్మీయతను పంచుకున్న కుటుంబ సభ్యులు**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 28 :** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం గిరినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్‌లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీనియర్ జర్నలిస్ట్ సరస్వతి నరేందర్ రాజు నివాసంలో శుక్రవారం ఆయన సోదరి, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు సరస్వతి నీరజ కుటుంబ సభ్యులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌లోని సోదరి నవ్యశ్రీ సంతోష్ నివాసంలోనూ సోదరులకు రాఖీలు కట్టి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను కుటుంబ సభ్యులంతా కలిసి జరుపుకున్నారు. ఒకరికొకరు రాఖీలు కట్టుకుని, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి భారతమ్మ, దేవరాజు అహల్య, సరికొండ విజయ శ్రీ, కూరపాటి శైలజరాణి, కూరపాటి సుధారాణి, కూరపాటి విద్య శ్రీ, శ్రావ్య శ్రీ, సరస్వతి గిరిధర్ రాజు, నిఖిల్ రాజు, శ్రీకర్ రాజు, బాహటం మల్లిక, శృతిక తదితరులు పాల్గొన్నారు.



# మార్కండేయ స్వామి సన్నిధిలో ఘనంగా నూలు పౌర్ణమి వేడుకలు





**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, :** రక్షాబంధన్ నూలు పౌర్ణమిని పురస్కరించుకుని సిద్దిపేట పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా యజ్ఞోపవీతాలు ధరించారు. అనంతరం సాయంత్రం మార్కండేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. రథయాత్రలో భాగంగా మొగ్గంపై పవిత్ర వస్త్రాన్ని నేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర మెయిన్ రోడ్డు, సుభాష్ రోడ్డు, పాత బస్టాండ్, విక్టరీ థియేటర్ చౌరస్తా మీదుగా వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు కొనసాగింది.చేతిమగ్గం, నూలు, వస్త్రం సిద్దిపేట చేనేత సంప్రదాయంతో విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉన్నాయి. తరాలు మారుతున్నా చేనేత వృత్తిపై మమకారం, సంప్రదాయాలపై గౌరవం కొనసాగుతోంది. పద్మశాలీలకు నూలు పౌర్ణమి కేవలం పండుగ మాత్రమే కాకుండా తరతరాలను కలిపే పవిత్రమైన సంప్రదాయంగా కొనసాగుతోంది. రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో పట్టణంలోని పురవీధులు ఆధ్యాత్మిక సందడితో పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సమాజం అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీష్, పట్టణ సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం, ఉపాధ్యక్షులు ఇప్పకాయల శ్రీహరి, పెద్ది అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, చిలుక ఆంజనేయులు, పెద్ద శ్రీనివాస్, దీకొండ మహేష్, బైరి ప్రకాష్, రాజ్‌కోటి, పేర్ల రాజేంద్రప్రసాద్, నగేష్, దండే సంతోష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. మహిళా విభాగం ప్రతినిధులు జలజ, యువజన విభాగం, మహిళా విభాగం ప్రతినిధులతో పాటు పద్మశాలి సమాజం, ఇందిరానగర్, శ్రీనగర్ కాలనీ, వివిధ కాలనీల సంఘాల ప్రతినిధులు పాల్గొని రథయాత్రను విజయవంతం చేశారు.

# జగద్గిరిగుట్ట అవుట్‌పోస్ట్ వద్ద ట్రాఫిక్ విధుల్లో ఆర్టీసీ కండక్టర్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 28, :** జగద్గిరిగుట్ట అవుట్‌పోస్ట్ వద్ద శుక్రవారం ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఓ ఆర్టీసీ కండక్టర్ విధులు నిర్వహిస్తున్న దృశ్యం అందరి దృష్టిని ఆకర్షించింది. సాధా రణంగా ప్రయాణికులకు సేవలందించే ఆర్టీసీ సిబ్బంది, ట్రాఫిక్ రద్దీని క్రమబ ద్ధీకరించేందుకు పోలీసులతో కలిసి బాధ్యతగా విధులు నిర్వహించడం అభినం దనీయమని పలువురు పేర్కొన్నారు. పోలీసులకు సహకరిస్తూ.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగస్వామ్యం రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు కండక్టర్ ముందుకు వచ్చి ట్రాఫిక్ పోలీసులకు సహకరించడం సామాజిక బాధ్యతకు నిద ర్శనంగా నిలిచింది. విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా ట్రాఫిక్‌ను సాఫీగా సాగించేందుకు ఆయన చేసిన ప్రయత్నాన్ని స్థానికులు అభినందించారు.

# 22ఏ నిషేధిత భూముల జాబితాకు వ్యతిరేకంగా 31న బీజేపీ ధర్నా

- **పాల్గొననున్న రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపీలు రఘునందన్ రావు, అరవింద్**
- **జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, :** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా, భూ భారతి పోర్టల్‌లో జరిగిన అవకతవకలపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 31న సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్టు బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులతో కలిసి మాట్లాడారు. ధర్నా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పాల్గొంటారని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా కార్యక్రమం కొనసాగుతుందని రైతులు, ప్రజలు, పార్టీ శ్రేణులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పేదల భూములు దోచుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏ జీవో తెచ్చిందని మండిపడ్డారు. మండలాల వారీగా 22ఏ జాబితాలో చేర్చిన భూముల వివరాలను సర్వే నెంబర్లతో సహా బహిర్గత పరచాలని డిమాండ్ చేశారు. ప్రజలను వంచించే ఈ జీవో తేవడం దుర్మార్గమైన చర్య అని దీనిని



ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్ రెడ్డి, ఉపాధ్యక్షులు సుభాష్ రెడ్డి, తొడుపునూరి వెంకటేశం, గుండ్ల జనార్దన్, బాసంగారి వెంకట్, పుల్లూరు రాజు, ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆడపడుచుల ఆత్మీయతే నాకు కొండంత బలం

- **ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**
- **మహిళల సంక్షేమం, భద్రతకు ఎల్లప్పుడూ అండగా ఉంటా**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 28, :**రాఖీ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆత్మీయత, సోదరభావం వెల్లివిరిసింది. బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ నివాస కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రాఖీ వేడుకల్లో నియోజకవర్గానికి చెందిన మహిళా ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు, మహిళలు పాల్గొని ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. ప్రతి సంవత్సరం



ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమం సందడిగా సాగింది. మహిళా ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు, మహిళలు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌కు రాఖీలు కట్టి తమ ఆప్యాయతను, అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ, "ఆడపడుచుల ఆత్మీయతే నాకు కొండంత బలం. మహిళల సంక్షేమం, భద్రత కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటాను. నా గెలుపులో కీలక పాత్ర పోషించిన మహిళా సోదరీమణులందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు" అని అన్నారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. రాఖీ పండుగ సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన అడువాల జ్యోతి

**హైదరాబాద్ బ్యూరో, ఆగస్టు 28, :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి చెల్లెలిగా రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. అంతకుముందు శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో అడువాల జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సంతోషం నెలకొనాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు.



# అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్

- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు**

**కూకట్‌పల్లి ప్రతినిధి,ఆగష్టు 28, :**రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు, నియోజకవర్గంలోని అక్కాచెల్లెళ్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసానికి చేరుకుని ఆయనకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు సోదరీమణులందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆప్యాయత, ఆనందాలను నింపాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అక్కాచెల్లెళ్ల ఆశీర్వాదాలు, ఆప్యాయతలు తనకు ఎల్లప్పుడూ కొండంత బలాన్ని ఇస్తాయని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడంలో సోదరీమణుల సహకారం, ప్రోత్సాహం తనకు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా సోదరీమణులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, వారి సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు తెలిపారు. అన్నాచెల్లెళ్ల,



అక్కాతమ్ముళ్ల అనుబంధం చిరకాలం వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందం, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

# రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఘనంగా పాల్గొన్న మహిళలు

- **అక్కాచెల్లెమ్మలకు చీరలు పంపిణీ చేసిన కుంట పద్మ సిద్ధిరాములు దంపతులు**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగష్టు 28, :**రాఖీ పౌర్ణమి సందర్భంగా కుత్బుల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి కుంట పద్మ సిద్ధిరాములు ఆధ్వర్యంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీడిమెట్ల ప్రాంతం నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన అక్కాచెల్లెమ్మలు అరుణారెడ్డి, మస్కూరి పద్మ, కృష్ణవేణి, సరోజ, బాలమణి, శ్యామల, విజయ, కవిత, కృష్ణవేణి, దేవి తదితరులతో



కలిసి కుంట పద్మ సిద్ధిరాములు దంపతులకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుంట పద్మ సిద్ధిరాములు దంపతులు రాఖీ కట్టిన ప్రతి మహిళకు చీరలను పంపిణీ చేసి, అక్కాచెల్లెమ్మలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రేమ, ఆప్యాయతలు, ఆత్మీయతలను మరింత బలోపేతం చేసే పండుగగా రాఖీ పౌర్ణమికి ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోగు సమ్మయ్య నేత, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, నదీమ్ రాయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతలు ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు.

# రీ–సర్వేను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్**

**జగిత్యాల కలెక్టరేట్, ఆగస్టు 28, :** జగిత్యాల జిల్లాలో చేపట్టిన గ్రామాల రీ–సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత కార్యాచరణ ప్రకారం అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని తహసీల్దార్లు, గిర్దావర్లు, గ్రామ పాలనాధికారులకు గ్రామాల రీ–సర్వే ప్రక్రియపై సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ**

రీ–సర్వే ద్వారా గ్రామాల్లోని ప్రతి భూ కమతాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖచ్చితంగా కొలిచి, భూ రికార్డులను నవీకరించడం జరుగుతుందని తెలిపారు. భూ యజమానుల హక్కుల పరిరక్షణతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలను నివారించడమే రీ–సర్వే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రీ–సర్వే ప్రారంభానికి ముందు గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, భూ యజమానులు, పట్టాదారులు, రైతులు, ప్రజాప్రతినిధులకు సర్వే కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, అటవీ భూములు, చెరువులు, కుంటలు, వాగులు, రహదారులు, శ్మశానవాటికలు, ప్రజా అవసరాలకు కేటాయించిన భూములు తదితర సామూహిక ఆస్తులను స్పష్టంగా గుర్తించి రికార్డు చేయాలని ఆదేశించారు. సర్వే సమయంలో రెవెన్యూ రికార్డులు, పాత గ్రామ పటాలు, సేత్వార్, టిప్పన్, ఖాస్రా పహాణి, ప్రస్తుత భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. పాత సర్వే నంబర్లు, కొత్త భూ కమతాల మధ్య సంబంధాన్ని తెలియజేసే కోరిలేషన్ స్టేట్‌మెంట్, ఫీల్డ్ రిజిస్టర్, ల్యాండ్ పార్సిల్ మ్యాప్, గ్రామ పటం తదితర రికార్డులను ఎటువంటి పొరపా ట్లకు తావులేకుండా రూపొందించాలని సూచించారు. భూ కమతాల కొలతలు పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు నోటీసులు జారీ చేసి, వారి సమక్షంలో హద్దులను నిర్ధారించాలని తెలిపారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లు వచ్చినప్పుడు వాటిని నిర్ణీత గడువులో స్వీకరించి, రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను



పరిశీలించిన తర్వాత నిష్పక్షపాతంగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ పాలనాధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, సర్వే బృందాలకు అవసరమైన భూ రికార్డులు, స్థానిక సమాచారం అందించాలని సూచించారు. గిర్దావర్లు రోజువారీ సర్వే పనులను పర్యవేక్షించాలని, తహసీల్దార్లు మండల స్థాయిలో మొత్తం ప్రక్రియను సమన్వయం చేస్తూ పురోగతిని నిరంతరం సమీక్షించాలని తెలిపారు. రీ–సర్వే అనేది కేవలం భూములను కొలిచే కార్యక్రమం మాత్రమే కాదని, గ్రామంలోని ప్రతి అంగుళం భూమికి సంబంధించిన సమగ్రమైన, శాశ్వతమైన, విశ్వసనీయమైన రికార్డును రూపొందించే కీలక కార్యక్రమమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి రీ–సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో రీ–సర్వేకు సంబంధించిన ముందస్తు కార్యక్రమాలు, గ్రామ సరిహద్దుల నిర్ధారణ, గ్రౌండ్ ట్రూతింగ్, భూ కమతాల కొలత, మ్యాపుల తయారీ, రికార్డుల పరిశీలన, ఫారాలు–రిజిస్టర్ల నిర్వహణ, అభ్యంతరాల పరిష్కారం, తుది భూ రికార్డుల రూపకల్పన తదితర అంశాలను అధికారులకు సవివరంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రె) లత, ఫారెస్ట్ , ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ జిల్లా అధికారులు, రెవెన్యూ, సర్వే–ల్యాండ్ రికార్డుల శాఖ అధికారులు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, గిర్దావర్లు, గ్రామ పాలనాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కి రాఖీ కట్టిన బోగ శ్రావణి

**హైదరాబాద్ బ్యూరో, ఆగష్టు 28, :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురిని హైదరాబాద్ లోని వారి నివాసంలో బిజెపి జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ బోగ శ్రావణి ఆత్మీయంగా కలిసి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ సందర్భంగా అర్వింద్ ధర్మపురికి రాఖీ కట్టి, ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరిన్ని విజయాలు కలగాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, సింగం పద్మ, గడ్డల లక్ష్మి , సోమ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# రాఖీ పండుగ సందర్భంగా పుప్పాల భాస్కర్‌కు రాఖీలు కట్టిన మహిళలు

- **సూరారంలో వెల్లివిరిసిన సోదరభావం, ఆత్మీయత**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 28, :** రాఖీ పండుగ సందర్భంగా సూరారం డివిజన్‌లో సోదరభావం, ఆత్మీయత వెల్లివిరిసింది. సూరారం డివిజన్‌కు చెందిన మహిళలు, ముస్లిం మహిళా సోదరీమణులు పెద్ద సంఖ్యలో సిఎంసీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ నివాసానికి శుక్రవారం చేరుకుని ఆయనకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పుప్పాల భాస్కర్‌ను తమ సోదరుడిగా భావిస్తూ రాఖీలు కట్టి రాఖీ



పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మతాలకు అతీతంగా పరస్పర గౌరవం, సోదరభావం, ఆత్మీయతను చాటిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ, మహిళలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, నమ్మకం ఎంతో విలువైనవని అన్నారు. మహిళలతో తనకున్న ఆత్మీయ అనుబంధానికి రాఖీ పండుగ కార్యక్రమం నిదర్శనమని పేర్కొన్నారు. మహిళల గౌరవం, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తూ అండగా ఉంటానని తెలిపారు. అనంతరం రాఖీలు కట్టిన మహిళలకు పుప్పాల భాస్కర్ కుటుంబ సభ్యులు చీరలను బహూకరించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల పట్ల గౌరవం, ఆప్యాయతను చాటేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు హేమలత రెడ్డి, లావణ్య, షైనాజ్, సుభద్ర, అర్షియ, ధనలక్ష్మి , భాగ్యతో పాటు సూరారం డివిజన్‌కు చెందిన పలువురు మహిళా సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



**కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్**

**జగిత్యాల/కోరుట్ల, ఆగష్టు 28, :** అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని సంజయ్ సోదరి డాక్టర్ సమత సంజయ్ కి రాఖీ కట్టారు. అలాగే కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తుందని, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ పవిత్రమైన రోజున ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఎమ్మెల్యే సంజయ్ గారు కోరుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు.

# సోదర సోదరీమణుల ఆత్మీయతకు చిహ్నం రాఖీ

- **రక్షాబంధన్ వేడుకల్లో తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**
- **మహిళా నాయకురాళ్లతో కలిసి ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 28, :** సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర నమ్మకానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జగద్గిరిగుట్ట డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శుక్రవారం రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మగ్దుమ్‌నగర్ రింగ్ బస్తీలోని తన నివాసంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, డివిజన్ బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లతో కలిసి రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు కొలుకుల జగన్‌తో పాటు ఆయన సోదరుడు కొలుకుల జైహింద్కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొలుకుల జగన్ మాట్లాడుతూ రాఖీ పండుగ కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదని, సోదర సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధం, ఆత్మీయతలకు ప్రతీక అని పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ఇలాంటి పండుగలు దోహదపడతాయని అన్నారు. ప్రతి కుటుంబంలో సోదరభావం, పరస్పర గౌరవం, ఆప్యాయతలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తనకు, తన సోదరుడికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపిన మహిళా నాయకురాళ్లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పండుగ



శుభాకాంక్షలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కొలుకుల లక్ష్మి , కొలుకుల బండి సత్యనారాయణ, కొలుకుల శశికళ, కొలుకుల జ్యోతి, కొలుకుల సాయి, శివాని, కార్తీక్, కీర్తితో పాటు నాయకులు పి. సతీష్ రెడ్డి, సునీల్ రెడ్డి, ద్రౌపతి, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సంజయ్ నివాసంలో రాఖీ కట్టిన మాజీ మున్సిపల్ చైర్మన్ జ్యోతి

**జగిత్యాల ప్రతినిధి, ఆగష్టు 28, :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ నివాసంలో ఆత్మీయ వాతావరణంలో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ జ్యోతి ఎమ్మెల్యేని సోదర భావంతో కలిసి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో సోదరభావం, మానవతా విలువలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రతినిధిగా జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో ఆత్మీయత, ఆనందం వెల్లివిరిసింది.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

**దావ వసంత సురేష్**

**జగిత్యాల ప్రతినిధి, ఆగష్టు 28, :** జగిత్యాల రూరల్ మండలం చల్గల్ గ్రామంలోని నూతనంగా ప్రతిష్ఠించిన ముద్ద వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. స్వామి వారి కృపాకటాక్షంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు అనంతరం అక్కడున్న సోదరి సోదరిమణులతో కలిసి రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ



రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముల మధ్య ఉన్న ఆప్యాయత మరింత బలపడాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆమె ఆకాంక్షించారు. రక్షాబంధన్ మన సంస్కృతి, కుటుంబ విలువలను ప్రతిబింబించే పవిత్రమైన పండుగని అన్నారు. జగిత్యాల జిల్లా మరియు నియోజకవర్గ ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్ రావు, గ్రామ సర్పంచ్ జున్ను రాజేందర్, నాయకులు పడిగేలా గంగారెడ్డి, ఆనంద్ రావు, ఎల్ల రాజన్న, చెట్లపెల్లి సత్యం, ప్రవీణ్ గౌడ్, బాలే చందు, యాళ్ళ మహేష్, బొల్లరపు ముత్యం, నలువాల తిరుపతి, జున్ను వెంకటేష్, కోల వెంకటేష్ ఓగులపు వెంకట రెడ్డి, బందేల రెడ్డి, మగ్గిడి రాజన్న, ఇప్పల గంగాధర్, వీరబత్తిని శ్రీనివాస్,బందేల మల్లయ్య, బందేల అనిల్, శేఖర్, పవన్ కళ్యాణ్, తరాల వెంకటేష్, వంశీ, రాజేందర్ లక్ష్మణ రావు తదితరులు ఉన్నారు.



# సోదర భావానికి కుల మతాలు అడ్డు రావు

- **12 ఏళ్లుగా రాఖీ కడుతున్న ముస్లిం మహిళ**
- **స్నేహానికి రక్తసంబంధం అవసరం లేదంటున్న మహిళ**

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు28, :** సంగారెడ్డి పట్టణంలో గల శాంతినగర్ లో నివాసం ఉంటున్న ఎండి కుత్బుద్దీన్, జహీరాబాద్ పట్టణంలోని బాగ రెడ్డిపల్లికి చెందిన గ్రామ పరిపాలన అధికారి నాగరాజు, ఇద్దరూ గత కొన్నిఏళ్లుగా స్నేహితులు. కుత్బుద్దీన్ కొన్నేళ్ల క్రితం



మృతి చెందారు. ఆయన సోదరి షహీన్ బేగం నాగరాజును సొంత అన్నగా భావిస్తూ 12 ఏళ్లుగా ప్రతి రాఖీ పౌర్ణమికి వచ్చి రాఖీ కడుతున్నారు. సొంత అక్క తమ్ముళ్లు అన్న చెల్లెలు ఆస్తులు కోసం కొట్లాడుకుని దూరం అవుతున్న ఈ రోజుల్లో సోదర భావం ముస్లిం మహిళ షహీన్ కి రక్తసంబంధం అవసరం లేదని నిరూపిస్తుంది. రాఖీ పండుగ అంటే అన్నదమ్ములు అక్క చెల్లెళ్లకు అనుబంధంగా ఉన్నటువంటి ప్రేమలను వ్యక్తపరుస్తూ రాఖీ కడుతూ రక్షగా ఉంటారని భావిస్తారు. కానీ ఖర్చులు పెంచుకొని ఈ రోజుల్లో సోదర భావంగా భావిస్తూ 12 ఏళ్లుగా ప్రతి రాఖీ పౌర్ణమికి వచ్చి రాఖీ కడుతున్న షహీన్ బేగంను పలువురు అభినందించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రాఖీ కట్టిన సోదరి



**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగష్టు 28, :**
రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆయన సోదరి లీల స్వగృహంలో రాఖీ కట్టారు. అనంతరం స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. రక్షాబంధన్ సందర్భంగా సోదర సోదరీమణుల ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని ఆది శ్రీనివాస్ పేర్కొంటూ, ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# సెప్టెంబర్ 01 నుంచి 07 వరకు మండల స్థాయి క్రీడా పోటీలు డిఈఓ రోహిణి



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 28, :**
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటి నుంచి ఏడు వరకు సంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాల్లో మండల స్థాయి క్రీడ పోటీలు నిర్వహించనున్నట్లు డిఈఓ రోహిణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలురు, బాలికలకు అండర్ 14, 17 విభాగాలలో వాలీబాల్, కబడ్డీ, కోకో, పోటీలు జరగనున్నాయని తెలిపారు. క్రీడ పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆమె సూచించారు. ప్రతి మండలంలో అన్ని విభాగాల నుండి చూపించినటువంటి ఆటల్లో రాణించిన వారికి మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# గర్షకుర్తిలో మార్కండేయుడి శోభయాత్ర

- యజ్ఞోపవీతధారణ, మగ్గంపై వస్త్రం వడికిన నేతన్నలు
- ఘనంగా రక్షాబంధన్ వేడుకలు







**చొప్పదండి/రామడుగు, ఆగష్టు 28, :**
గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో శుక్రవారం నూలు పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ శివభక్త మార్కండేయస్వామి ఆలయంలో శ్రీపతి నరసయ్య, మధు పురహితుల వేదమంత్రాలతో శోభయాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. మార్కండేయస్వామి చిత్రపటాన్ని శావలో పెట్టి, మగ్గం, రాట్నంను ట్రాక్టర్ పై ఏర్పాటు చేసి నేతన్నలు వస్త్రం వడుకుతూ గ్రామంలోని వీధివీధిన తిప్పుతూ శోభయాత్ర నిర్వహించారు. భక్తి పాటలు ఆలపిస్తూ భజనపరులు, ప్రజలు ముందుకు సాగగా, మార్కండేయస్వామి శోభయాత్ర కన్నుల పండుగా సాగింది. మహిళలు భక్తిలో నీలమై మంగళహారతులు పట్టి టెంకాయలు కొట్టి మార్కండేయస్వామి శోభయాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్యదర్శి అలువాల రాజేశం, గుండ రాజేశం, నల్ల శ్రీనివాస్, దూస సురేందర్, చిందం చంద్రశేఖర్, భావన ఋషి స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు గజ్జల శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, అలువాల గణేష్, వ్యాపార సంఘం అధ్యక్షులు, అలువాల విటోబా, కార్మిక సంఘం నాయకుడు శ్రీశైలం, గ్రామ సర్పంచ్ చిందం ఆంజనేయులు, మాజీ ఎంపిటీసీ చిప్ప చక్రపాణి, మాజీ సర్పంచ్ కమటం రాజమల్లు, అలువాల తిరుపతి బూర్ల శ్రీనివాస్, కొలిపాక తిరుపతి, శ్యామల శంకరయ్య, చిందం ప్రభాకర్ ఉప సర్పంచ్ దాది హరీష్ లావణ్య, వార్డ్ మెంబర్లు, పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు – ఇదే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యం

- కుత్బుల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా ప్రారంభించిన మన్నె రాజు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగష్టు 28, :**పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన లక్కీ డ్రాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ, “ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. సంవత్సరం తిరిగేలోపు ప్రతి ఆడబిడ్డకు సొంత ఇల్లు ఉండాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నాం. పేద కుటుంబాల సొంతింటి కలను నిజం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం” అని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని.. అది ఒక కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, స్థిరమైన భవిష్యత్తుకు భరోసా అని మన్నె రాజు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కొత్త ఆశలు, నమ్మకాన్ని నింపుతోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకమైన, నిష్పక్షపాతమైన విధానంలో లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. “పేదల కన్నీళ్లు తుడవడం, వారి జీవితాల్లో వెలుగులు నింపడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానం. సంక్షేమ పథకాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల జీవితాల్లో శాశ్వతమైన మార్పు తీసుకురావాలన్నదే మా సంకల్పం” అని మన్నె రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం చేకూరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ప్రజలు ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి, అందుతున్న సంక్షేమ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఆర్డీవో టీ. స్టాంప్ ప్రకాష్, మేడ్చల్–మల్కాజ్‌గిరి ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. సిద్ధార్థ, హౌసింగ్ బోర్డ్ సెక్రటరీ విమల, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వాణితో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- అధికారులతో కలిసి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలన
- సీఎంకి ప్రజల పక్షాన ఎమ్మెల్యే ధన్యవాదాలు



**జగిత్యాల ప్రతినిధి, ఆగష్టు 28, :**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతోందని, జగిత్యాల నియోజకవర్గంలోని తాటిపల్లి శివారులో 25 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరిశీలించారు. తెలంగాణ ముఖ్యమంత్రి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశ్యం పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాలను ఒకే ప్రాంగణంలో అందించడమని అన్నారు. 2500 మంది విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య, హాస్టల్, భోజనం వంటి వసతి సౌకర్యాలు ప్రయోగశాలలు, లైబ్రరీ, కంప్యూటర్ సదుపాయాలుక్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అందించడం ప్రాధాన్యతని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, అన్ని వర్గాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతని అన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జగిత్యాల ప్రజల పక్షాన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య, ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, సర్పంచులు బొలిశెట్టి గంగారెడ్డి, కట్ట రాజేందర్, మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, పెండెం రాములు, మాజీ సర్పంచ్లు నక్కల రవీందర్ రెడ్డి, బాల ముకుందం, గంగారం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూమారెడ్డి, నాయకులు మల్లేశం గౌడ్, సురేష్, సదానందం, సతీష్, గంగారెడ్డి, మహేష్, మనోజ్, దిలీప్, వెంకటేష్, ఎమ్మార్వో హకీమ్, ఏఈలు శశి, ధనుంజయ్, తాటిపల్లి, చల్గల్, మోరపల్లి గ్రామాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులు

**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 28, :**
సిద్దిపేట జిల్లా దుబ్బాకలో సీపీఎం ఆధ్వర్యంలో బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల ఫోటోకు శుక్రవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గం సభ్యులు గొడ్డుబర్ల భాస్కర్ మాట్లాడుతూ 26 ఏండ్ల క్రితం ఉమ్మడి ఏపీలో విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజలు సాగించిన పోరాటం విద్యుత్ ప్రైవేటీకరణను తిప్పికొట్టిందనీ తెలిపారు. ఆ పోరాటంలో పోలీసు కాల్పులకు బలై ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగం విద్యుత్తు రంగాన్ని ప్రజల కోసం కాపాడే పోరాటానికి చిరస్మరణీయ స్ఫూర్తిగా నిలిచిందనీ అన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడా కార్పొరేట్ల ఒత్తిడితో మోడీ ప్రభుత్వం తాజాగా విద్యుత్ సవరణ చట్టాన్ని తీసుకొస్తు వినియోగదారులపై విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచేలా “కాస్ట్ రిఫ్లెక్టింగ్ ఛార్జెస్” అనే ప్రతిపాదనను తీసుకొచ్చిందనీ విమర్శించారు. మన దగ్గర తక్కువ రేటుకు వచ్చే సింగరేణి బొగ్గును కాదని, మోడీ ప్రభుత్వం ఆస్ట్రేలియాలో మైనింగ్ చేసే అదానీ బొగ్గును మన విద్యుత్ సంస్థలు ఖచ్చితంగా 15 శాతం కొనాలని ఆదేశించడం దుర్మార్గమైన చర్య అన్నారు. విద్యుత్ చట్టంలో ప్రమాదకరమైన అంశం క్రాస్ సబ్సిడీ రద్దు చేయడం వలన ఉచిత విద్యుత్తు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్య, వైద్య సంస్థలకు, 200లోపు యూనిట్లు వాడే బలహీన వర్గాల కుటుంబాలకు విద్యుత్ రాయితీలను కూడా బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తున్నదని విమర్శించారు. రైతులకు భారమై భూములన్ని పెద్ద కార్పొరేట్ కంపెనీలు చేజిక్కించుకొని కార్పొరేట్ వ్యవసాయం తీసుకువచ్చే కుట్ర అమల్లోకి వస్తుందని మండిపడ్డారు. మోటార్లకు మీటర్లను బిగించాలని రాష్ట్రాల మీద కేంద్ర సర్కార్ ఒత్తిడి పెంచుతున్నదని విమర్శించారు. దేశానికి ప్రాణవాయువు లాంటి విద్యుత్ మీద బడా కార్పొరేట్ శక్తులు కేంద్ర బీజేపీ ప్రభుత్వ మద్దతుతో చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా విద్యుత్ వినియోగదారులు, రైతాంగం, కార్మికులు, ఉద్యోగులు ఇంజినీర్లు సమస్త ప్రజానికం పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. విద్యుత్తు పోరాట అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో విద్యుత్ సంస్కరణల ముప్పును అడ్డుకుని విద్యుత్తును ప్రజాసేవగా, ప్రజల హక్కుగా కాపాడుకోవడమే బషీర్‌బాగ్ అమరవీరులకు మన మందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం దుబ్బాక పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్ నాయకులు బత్తుల రాజు, మహేష్, కంపే ఎల్లయ్య, మల్లయ్య, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




# కొత్త పెన్షన్ల మంజూరుకు అర్హులైన వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

## అదనపు కలెక్టర్ పాండు



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 28, :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకం–2026 కింద అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ పాండు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్, బ్యానర్, కరపత్రాలను శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్‌డీఏ అదనపు పీడీ సూర్యారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, రక్త సంబంధిత దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం చేయూత సామాజిక భద్రత పింఛన్లను అందిస్తోందన్నారు. కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్న వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వితంతువులు 18 సంవత్సరాలు పైబడి, భర్త మరణ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి, ఒంటరి మహిళలు 18 సంవత్సరాలు పైబడి భర్తతో విడిపోయి వదిలివేయబడి కనీసం ఒక సంవత్సరం పూర్తయిన వారు అర్హులని, గ్రామీణ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు, పట్టణ ప్రాంతాల్లో 35 సంవత్సరాలు పైబడిన అవివాహితులు అర్హులని తెలిపారు. దివ్యాంగులకు వయస్సుతో సంబంధం లేకుండా అర్హత ఉంటుందని పేర్కొన్నారు. ధృవీకరణ ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉండాలని, 51 శాతం వినికిడి లోపం ఉన్నవారికి, రక్త సంబంధిత దివ్యాంగులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వ్యాధులతో బాధపడుతున్న వారు, సదరం ధృవీకరణ ఉండాలని తెలిపారు. కల్లుగీత కార్మికులు 50 సంవత్సరాలు పైబడి,కల్లుగీత కార్మికుల సహకార సంఘ సభ్యత్వం ఉండాలని, ఎక్సైజ్ శాఖ ధృవీకరణ అవసరమని స్పష్టం చేసారు. చేనేత కార్మికులు 50 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని, చేనేత, జౌళి శాఖ ధృవీకరణ ఉండాలని తెలిపారు. ఫైలేరియా బాధితులు గ్రేడ్–2, గ్రేడ్–3 ఫైలేరియా వ్యాధిగ్రస్తులు అర్హులైన వారు సంబంధిత గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు/మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు/పురపాలక కమిషనర్లు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. అలాగే వెబ్‌సైట్‌లోని “చేయూత అప్లికేషన్ ఫార్మ్స్” బటన్ నొక్కి దరఖాస్తు ఫారాలను పొందవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకునే విధంగా మహిళా సమాఖ్యల సహకారంతో దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన ధృవపత్రాల విషయంలో సహాయం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హులైన వారు ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ పాండు కోరారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ప్రయోజనం అందేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.



# అచ్చతెలుగు 'చిచ్చర పిడుగు' గిడుగు

## నేడు తెలుగు భాషా దినోత్సవం

### వ్యావహారిక భాషోద్యమానికి ఆద్యుడు గిడుగు రామమూర్తి

**"భాష ప్రజలది.. ప్రజలు మాట్లాడేదే సజీవ భాష"- ఈ భావనను కేవలం మాటల్లో చెప్పడం కాదు.. దాని కోసం జీవితాంతం పోరాడిన భాషా యోధుడు గిడుగు వెంకట రామమూర్తి. పండితులకే పరిమితమైన గ్రాంథిక భాష గోడలను బద్దలుకొట్టి, సామాన్యుడి మాటకు సాహిత్య గౌరవం కల్పించిన సంస్కర్త. తెలుగు వచనాన్ని జనానికి దగ్గర చేసి, విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ఉద్యమించిన 'అచ్చతెలుగు చిచ్చర పిడుగు'. ఆయన జయంతి ఆగస్టు 29నే తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం.**

ఆధునిక తెలుగు భాషా వికాసాన్ని గిడుగు రామమూర్తికి ముందు.. తర్వాత అని విభజించి చూసినా అతిశయోక్తి కాదు. ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, విద్యాబోధనకు, వచన రచనకు కఠినమైన కావ్య, గ్రాంథిక భాష సరిపోదని ఆయన గుర్తించారు. సామాన్యుడికి అర్థమయ్యే 'శిష్ట వ్యావహారికం'లో రచనలు సాగాలని ప్రతిపాదించారు. అది కేవలం భాషా సంస్కరణగా ఆగిపోలేదు. తెలుగు విద్య, సాహిత్య రంగాల్లో పెను మార్పునకు నాంది పలికింది. గిడుగు సాగించిన వ్యావహారిక భాషోద్యమంతో ఆధునిక తెలుగు సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. వచన రచన విస్తరించింది. పత్రికా భాష సరళమైంది. విద్య సామాన్యుడికి చేరువైంది. విశ్వవిద్యాలయాల నుంచి పత్రికల వరకు వాడుక భాష క్రమంగా విస్తరించింది. తెలుగు అధికార, పరిపాలనా భాషగా ఎదిగే క్రమంలోనూ వ్యావహారిక భాషోద్యమం కీలక పాత్ర పోషించింది. గిడుగు పోరాటం అంత సులభంగా సాగలేదు. వాడుక భాషలో రచనలు చేయాలన్న ఆయన ప్రతిపాదనను అప్పటి గ్రాంథికవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. వ్యావహారికాన్ని 'గ్రామ్య భాష'గా హేళన చేశారు. గిడుగుపైనా విమర్శలు చేశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, వేదం వెంకటరామశాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి వంటి పండితులతో ఆయన భాషాపరమైన వాదోపవాదాలు సాగించారు. కానీ గిడుగు వెనక్కి తగ్గలేదు. పండితులు సైతం తప్పులు లేకుండా రాయలేని గ్రాంథిక భాషను చిన్నారులపై ఎందుకు రుద్దాలని ప్రశ్నించారు. పిల్లలకు చదువు అర్థం కావాలంటే వారు మాట్లాడే భాషకు దగ్గరగా పాఠ్యపుస్తకాలు ఉండాలని వాదించారు. కాలం మారుతున్నప్పుడు భాష కూడా మారుతుందని.. మార్పు భాషకు బలహీనత కాదని నిరూపించేందుకు ప్రయత్నించారు.

'తెలుగు' పత్రికే ఆయుధం

వ్యావహారిక భాషోద్యమ ప్రచారానికి గిడుగు పత్రికను కూడా ఆయుధంగా చేసుకున్నారు. 1919లో 'తెలుగు' మాసపత్రికను ప్రారంభించి తన శాస్త్రీయ వ్యాసాలు, ఉపన్యాసాల ద్వారా వాడుక భాష అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. గ్రాంథిక భాషలోని సంక్లిష్టతలను వివరిస్తూ తన వాదనను బలంగా వినిపించారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షుడిగా, గిడుగు కార్యదర్శిగా 'వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం' ఏర్పాటైంది. గురజాడ అప్పారావు సహా పలువురు రచయితలు, పండితులు వ్యావహారిక భాష అవసరాన్ని బలపరిచారు. క్రమంగా గిడుగు పోరాటానికి సాహిత్య ప్రపంచంలో మద్దతు పెరిగింది. "వాడుక భాష గ్రామ్య భాష కాదు.. అది సజీవ భాష" అన్నది గిడుగు ఉద్యమ సారాంశం. నన్నయ కాలం నాటి తెలుగుకు, తిక్కన కాలం నాటి తెలుగుకు, ప్రబంధ యుగంలోని భాషకు తేడాలు ఉన్నట్లే కాలంతో పాటు భాష మారడం సహజమని ఆయన వివరించారు. వ్యావహారిక భాషోద్యమం ప్రాచీన సాహిత్యానికి వ్యతిరేకంగా పుట్టిన ఉద్యమం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రాచీన కావ్యాలు, వ్యాకరణాలపై గౌరవం ఉంచుతూనే సమకాలీన అవసరాలకు అనుగుణంగా వాడుక భాషకు ప్రాధాన్యం ఇవ్వాలన్నదే ఆయన లక్ష్యం. గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' వంటి రచనలు వాడుక భాషలోనూ గొప్ప సాహిత్యాన్ని సృష్టించవచ్చని నిరూపించాయి. గిడుగు సేవలు తెలుగుతోనే ఆగిపోలేదు. ఆదివాసీ సవరల భాష, విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి అసాధారణం. సవర భాషను స్వయంగా నేర్చుకుని, ఆ భాష మాట్లాడే ప్రజలకు వారి మాతృభాషలోనే విద్య అందించేందుకు ప్రయత్నించారు. సొంత ఖర్చులతో పాఠశాలలకు సహకరించి, ఉపాధ్యాయుల వేతనాలు చెల్లిస్తూ సవరల విద్య కోసం కృషి చేశారు. దశాబ్దాల పరిశోధనతో సవర భాషా వ్యాకరణాన్ని, సవర--ఆంగ్ల నిఘంటువును రూపొందించారు. ముండా భాషల ఉపకుటుంబానికి చెందిన సవర భాషను శాస్త్రీయంగా అధ్యయనం చేసిన తొలి భారతీయ భాషావేత్తల్లో గిడుగు ప్రత్యేక స్థానం సంపాదించారు. ఆయన సేవలను గుర్తించిన అప్పటి మద్రాసు ప్రభుత్వం 'రావ్ బహదూర్', 'కైజర్-ఇ-హింద్' వంటి గౌరవాలతో సత్కరించింది. గిడుగు కేవలం భాషావేత్త మాత్రమే కాదు. చరిత్రకారుడు, పరిశోధకుడు, సంఘ సంస్కర్త కూడా. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సమయంలోనే దేవాలయ శాసనాల లిపిని అధ్యయనం చేసి వాటిని చదవడం నేర్చుకున్నారు. శాసనాల ఆధారంగా ముఖ్యంగా గాంగ వంశ చరిత్రపై పరిశోధనలు చేసి ఆంగ్లంలో ప్రామాణిక వ్యాసాలు రాశారు. సుమారు మూడు దశాబ్దాల అధ్యాపక సేవ అనంతరం 1911లో పదవీ విరమణ చేసిన గిడుగు.. తన జీవితంలో మిగిలిన కాలాన్ని ఆధునికాంధ్ర భాషా సంస్కరణకు అంకితం చేశారు. తాను ప్రారంభించిన వ్యావహారిక భాషోద్యమం ఫలితాలను జీవిత చరమాంకంలోనే గిడుగు చూడగలిగారు. పత్రికలు, రచనలు వాడుక భాషకు దగ్గరవడం ఆయనకు సంతృప్తినిచ్చింది. అయితే విద్యాసంస్థల్లో గ్రాంథిక భాష ఆధిపత్యం పూర్తిగా తొలగకపోవడంపై చివరి వరకు ఆవేదన వ్యక్తం చేశారు. 1940 జనవరి 22న ఆయన కన్నుమూశారు. నేడు మనం చదివే పత్రిక.. మనకు సులభంగా అర్థమయ్యే పాఠ్యపుస్తకం.. సామాన్యుడి మాటల్లో సాగే కథ, నవల.. ప్రజలకు చేరువైన పరిపాలనా భాష---వీటన్నింటి వెనుక గిడుగు సాగించిన మహోద్యమపు అడుగుజాడలు కనిపిస్తాయి. తెలుగును పండితుల పీఠం నుంచి దించి ప్రజల నాలుకపై నిలిపినవాడు గిడుగు. భాషను మార్చలేదు.. భాషకు స్వేచ్ఛ ఇచ్చాడు. సామాన్యుడి మాటకు గౌరవం తెచ్చాడు. అందుకే ఆగస్టు 29 కేవలం గిడుగు జయంతి కాదు.. తెలుగు తన సజీవత్వాన్ని, తన సహజత్వాన్ని సగర్వంగా చాటుకునే రోజు. 'దేశభాషలందు తెలుగు లెస్స' అన్న మాటకు జనభాషలో జీవం పోసిన ఆ అచ్చతెలుగు చిచ్చర పిడుగుకు ఇదే నిజమైన నివాళి.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
**9440595494**

# అణు బాంబు నీడలో మానవ జీవితం
# అణు వ్యతిరేక ఉద్యమం అనివార్యం

## నేడు అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం



**ప్రపంచ చరిత్రలో అణుశక్తి మానవ మేధస్సు ఆవిష్కరణకు ప్రతీకగా నిలిచినప్పటికీ, అదే శక్తి మానవ నాగరికతను నాశనం చేసే భయంకర శక్తిగా కూడా పరిణమించింది.**

ప్రపంచ శాంతి, మానవ రక్షణ, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలు నేటి యుగంలో అత్యంత ప్రాధాన్యం సంతరించు కున్నాయి. అణు ఆయుధాలు మానవజాతికి శక్తి, ఆధిపత్యం, సాంకేతిక ప్రగతి యొక్క చిహ్నాలుగా భావించ బడినా వాటి విధ్వంసకర శక్తి ప్రపంచాన్ని పునరావృతంగా ఆలోచించేలా చేస్తోంది. అందుకే ప్రతి సంవత్సరం ఆగస్టు 29న అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం జరుపు కుంటారు. 1991లో కజాఖ్‌స్తాన్ లోని సెమిపాలటిన్స్క్ అణు పరీక్షా క్షేత్రం మూతపడిన రోజు గుర్తింపుగా ఐక్యరాజ్య సమితి 2009 డిసెంబర్ 2న తీర్మానం ఆమోదించి ఈ దినోత్సవాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ నిర్ణయం అణు పరీక్షలు మానవ జాతిపై మోపిన విపరీతమైన దుష్పరిణామాలను స్మరింప జేయడమే కాక భవిష్యత్తులో అణు ముప్పులను నివారించే ప్రయత్నాలకు ఒక బలమైన ఆహ్వానం.

ప్రపంచ చరిత్రలో అణు పరీక్షల మొదటి దృశ్యం 1945 జూలై 16న అమెరికా న్యూ మెక్సికోలోని అలమోగోర్డోలో "ట్రినిటీ" పేరిట జరిగిన ప్రయోగమే. తరువాత అదే సంవత్సరం జపాన్‌పై హిరోషిమా, నాగసాకిపై అణు బాంబులు ప్రయోగించ బడినప్పుడు ప్రపంచం అణు శక్తి యొక్క భయానకతను ప్రత్యక్షంగా చూచింది. ఆ ఘోర వినాశనం లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నదే కాక తరతరాల పాటు ఆ ప్రాంతాల్లో వికలాంగత్వం, కేన్సర్లు, పర్యావరణ కాలుష్యం వంటి అపరిమిత కష్టాలను మిగిల్చింది. ఆ తర్వాత అమెరికా, సోవియట్ యూనియన్, ఫ్రాన్స్, బ్రిటన్, చైనా తదితర దేశాలు యుద్ధ కాలంలో ఆధిపత్య పోరులో భాగంగా వందలాది అణు పరీక్షలు జరిపాయి. ఈ పరీక్షలు కేవలం ఎడారులు, సముద్రాలు, భూమి గర్భానికే పరిమితం కాలేదు; వాటి ప్రభావం వాతావరణంలో రేడియోధార్మిక కణాలుగా వ్యాప్తి చెంది మానవ ఆరోగ్యం, పర్యావరణ సమతుల్యంపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 2,000కి పైగా అణుపరీక్షలు జరిగాయి. వీటిలో అమెరికా 1,030, సోవియట్ యూనియన్ 715, ఫ్రాన్స్ 210, బ్రిటన్ 45, చైనా 45, భారత్ 6, పాకిస్తాన్ 6, ఉత్తర కొరియా 6 పరీక్షలు జరిపాయి. ప్రతి పరీక్ష వాతావరణంలో విష రసాయనాలు, రేడియేషన్ విడుదల చేస్తూ జీవవైవిధ్యాన్ని ముప్పుకు గురిచేసింది.

సంవత్సరాలుగా అణు పరీక్షల వ్యతిరేకంగా ప్రజల నిరసనలు ఉధృతమయ్యాయి. జపాన్‌లో అణుబాంబు బాధితులు, శాంతి కార్యకర్తలు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు నడిపారు. ఈ నేపథ్యంలో 1963లో అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్‌లు "పాక్షిక అణు పరీక్షా నిషేధ ఒప్పందం"పై సంతకం చేసి భూమి మీద, వాతావరణంలో, నీటిలో పరీక్షలను నిషేధించాయి. అయితే భూగర్భ పరీక్షలకు మాత్రం అవకాశం ఇచ్చారు. తదనంతరం 1996లో సమగ్ర అణు పరీక్షా నిషేధ ఒప్పందం (జుదీ) రూపొందినా అది అమల్లోకి రాలేదు, ఎందుకంటే అణు శక్తివంతమైన కొన్ని దేశాలు దానిని అనుమోదించలేదు. అయినప్పటికీ, ఆ ఒప్పందం అంతర్జాతీయ రాజకీయాల్లో అణు నియంత్రణకు ఒక ప్రధాన పునాది వేసింది. భారతదేశం 1974లో "స్మైలింగ్ బుద్ధా" పేరిట మొదటి అణుపరీక్ష, 1998లో పోఖ్రాన్-×× పేరిట ఐదు అణుపరీక్షలు నిర్వహించింది. అయితే భారత్ ఎల్లప్పుడూ "ప్రథమంగా అణ్వస్త్ర వినియోగం చేయమని" (చీశ ఖీఱతీర్ ఖంవ్రాశీశ్రీఱఎ) స్పష్టంగా ప్రకటించింది. ఈ విధానం ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇస్తుంది. అణు పరీక్షల ప్రభావం మానవ జీవితంలో అనేక కోణాలలో ప్రతిఫలించింది. భూగర్భ పరీక్షల వల్ల భూకంపాలు, భూగర్భ జలాల కలుషితం, నేల పాడైపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సముద్ర పరీక్షలు సముద్ర జీవ సంపదపై ఘోర ప్రభావం చూపాయి. వాతావరణంలో వ్యాపించిన రేడియోధార్మిక కణాలు ఆహార శ్రేణిలోకి చేరి తరతరాల పాటు జన్యు వ్యాధులను సృష్టించాయి. వైద్యపరమైన పరిశోధనల ప్రకారం అణు పరీక్షల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలలో కేన్సర్, ల్యూకేమియా, థైరాయిడ్ వ్యాధులు అధికంగా కనిపించాయి. కజాఖ్‌స్తాన్ లోని సెమిపాలటిన్స్క్ ప్రాంతం, పసిఫిక్ మహాసముద్రం లోని బికినీ అటోల్ దీవులు, నెవాడా ఎడారి లాంటి ప్రాంతాలు ఈ విషాదానికి సాక్ష్యాలుగా నిలిచాయి.

అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం నేడు మనిషి అనుభవించిన దుర్ఘటనల జ్ఞాపకమే కాక భవిష్యత్తు పట్ల మానవజాతికి ఒక హెచ్చరిక. ఈ రోజు దేశాలు పరస్పరం నమ్మకం పెంపొందించుకొని, ఆయుధ పోటీకి బదులుగా శాంతి సహకారం వైపు నడవాలని గుర్తు చేస్తుంది. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ శాంతి సంస్థలు, శాస్త్రవేత్తలు, పౌర సమాజం అన్ని వర్గాలు ఈ రోజు నాడు అణు పరీక్షల ముప్పును సవివరంగా చర్చించి ప్రత్యామ్నాయ భద్రతా మార్గాలను అన్వేషిస్తాయి. అణు నిరాయుధీకరణ దిశగా వియన్నా, జెనీవా వంటి నగరాల్లో అనేక చర్చలు జరుగుతాయి. ఇది కేవలం ప్రభుత్వాలకే కాక సాధారణ పౌరులకూ శాంతి పట్ల బాధ్యతను గుర్తు చేసే రోజు. అణు శక్తి శాంతి ప్రయోజనాల కోసం ఉపయోగపడే శక్తివంతమైన సాధనం కావచ్చు. విద్యుత్ ఉత్పత్తి, వైద్యరంగం, వ్యవసాయం వంటి రంగాల్లో అది సద్వినియోగం అవుతుంది. కానీ దాన్ని ఆయుధాలుగా వినియోగించడం మానవ జాతికి అస్తిత్వపరమైన ముప్పు. అందుకే అంతర్జాతీయ సమాజం అణు నిరాయుధీకరణ పట్ల కట్టుబాటుగా ఉండి అణు పరీక్షలు జరపకుండా నిబద్ధతతో ముందుకు సాగాలి. ఆగస్టు 29 మనకు చేసే బోధ ఇదే. భవిష్యత్తు తరాలకు ఒక సురక్షితమైన, శాంతియుతమైన ప్రపంచాన్ని అందించాలంటే అణు ఆయుధాల రహిత భూగోళాన్ని సాధించడానికి ప్రయత్నాలు ఆగ కూడదు. మానవ జీవన విలువను కాపాడటం, ప్రకృతి సమతుల్యతను పరిరక్షించడం, శాంతిని నిలబెట్టడం అనే మూడు లక్ష్యాల కోసం ఈ రోజు మానవ జాతి ఒకటిగా నిలబడి ఆత్మ పరిశీలన చేయాలి.


**ఈ విధంగా అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం చరిత్రను మాత్రమే కాదు, వర్తమానం, భవిష్యత్తును కూడా ఆలోచింపజేసే సందర్భం. ఇది కేవలం ఒక జ్ఞాపక దినం కాదు, మానవజాతి తన దారిని శాంతి, సహజీవనం వైపు మళ్లించుకోవాల్సిన సమయం అని గుర్తు చేసే అంతర్జాతీయ పిలుపు.**

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
**9440595494**

# తెలుగు సాహితీ పరిశోధనా పితామహుడు
# వేటూరి ప్రభాకర శాస్త్రి

## నేడు వేటూరి ప్రభాకరశాస్త్రి వర్ధంతి

**"భాష ప్రజలది.. ప్రజలు మాట్లాడేదే సజీవ భాష"- ఈ భావనను కేవలం మాటల్లో చెప్పడం కాదు.. దాని కోసం జీవితాంతం పోరాడిన భాషా యోధుడు గిడుగు వెంకట రామమూర్తి. పండితులకే పరిమితమైన గ్రాంథిక భాష గోడలను బద్దలుకొట్టి, సామాన్యుడి మాటకు సాహిత్య గౌరవం కల్పించిన సంస్కర్త. తెలుగు వచనాన్ని జనానికి దగ్గర చేసి, విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ఉద్యమించిన 'అచ్చతెలుగు చిచ్చర పిడుగు'. ఆయన జయంతి ఆగస్టు 29నే తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం.**



సాహిత్యం అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, అది ఒక జాతి చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించే దర్పణమని నమ్మి, కాలగర్భంలో కలిసిపోతున్న ప్రాచీన తెలుగు వైభవాన్ని వెలికితీసిన మహనీయుడు వేటూరి ప్రభాకర శాస్త్రి (1888-1950). 'తెలుగు సాహితీ పరిశోధనా పితామహుడు'గా కీర్తించబడిన ఆయన వర్ధంతి నేడు. భాషను ఒక అడవితో, కవితను ఉద్యానవనంతో పోలుస్తూ-ఉద్యానవనం వికసించాలంటే అరణ్య పరిశోధన ఎంత అవసరమో, సుకవితకు భాషా పరిశోధన అంతే ముఖ్యమని గట్టిగా విశ్వసించిన పరిశోధక రత్న వేటూరి.

### చిన్నతనంలోనే బహుముఖ ప్రజ్ఞ

కృష్ణా నది తీరంలోని పెదకళ్ళేపల్లిలో 1888 ఫిబ్రవరి 7న జన్మించిన ప్రభాకర శాస్త్రి, బాల్యంలోనే తండ్రి వద్ద సంస్కృతాంధ్రాలను అభ్యసించారు. అనంతరం చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి శిష్యరికంలో నైపుణ్యాన్ని సాధించారు. పిన్న వయసులోనే 'శతావధాని'గా విశేష కీర్తి ప్రతిష్టలు సంపాదించినప్పటికీ, అవధాన విద్య కేవలం క్షణికానందమేనని గ్రహించి, తన జీవితానికి పరమార్థం నిరంతర సాహిత్య పరిశోధనేనని నిర్ణయించుకున్నారు. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో ముప్పై ఏళ్లకు పైగా పనిచేస్తూ, మురికిపట్టిన తాళపత్ర గ్రంథాలకు సరికొత్త వెలుగునిచ్చారు.

### అన్నమయ్య ఉనికిని లోకానికి చాటిన మహోపకారి

తెలుగు సాహిత్యంలో ఐదు శతాబ్దాల పాటు మరుగున పడిపోయిన పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత వేటూరిదే. తిరుమల రాగిరేకుల గదిలో నిక్షిప్తమై ఉన్న అన్నమయ్య పదాలను వెలికితీసి, తాళ్లపాక చిన్నన్న రాసిన 'అన్నమాచార్య చరిత్ర'ను సవరించి ప్రచురించారు. తిరుమలలో అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, ఆయన సంకీర్తనలకు విస్తృత ప్రాచుర్యం కల్పించారు. అలాగే తెలుగు లిపి ప్రాచీనతకు ప్రామాణికంగా భావిస్తున్న 'నాగబు' అనే తొలి తెలుగు పదాన్ని శాసనాల ద్వారా గుర్తించి వెలుగులోకి తెచ్చారు.

### అపరిమిత గ్రంథ పరిష్కరణ - బహుభాషా పరిజ్ఞానం

'శృంగార శ్రీనాథం', 'క్రీడాభిరామం', 'బసవ పురాణం', 'రంగనాథ రామాయణం', 'చాటుపద్య మణిమంజరి', 'తంజావూరి ఆంధ్ర రాజుల చరిత్ర' వంటి అత్యంత విలువైన ప్రాచీన కావ్యాలను లోతైన పరిశోధనా పీఠికలతో పరిష్కరించి ముద్రించారు. సి.పి. బ్రౌన్ చేసిన సేవలను, తొలి తెలుగు కవయిత్రి తాళ్లపాక తిమ్మక్క విశిష్టతను నేటి తరానికి అందించారు. తమిళం, కన్నడ భాషలలో ప్రావీణ్యం సంపాదించి ఆండాళ్ రాసిన తిరుప్పావై పాశురాలను తెలుగులోకి అనువదించారు. చిన్న పిల్లలు పాడే పాటలు, మాటలను సేకరించి 'భారతి' పత్రికలో 'బాలభాష' పేరుతో ప్రచురించి జానపద సాహిత్యానికి పీఠం వేశారు.

1950 ఆగస్టు 29న కన్నుమూసిన వేటూరి ప్రభాకర శాస్త్రి గారు, కేవలం ఒక రచయితగానే కాక, విమర్శకుడు, శాసన పరిశోధకుడు, అనువాదకుడు, నాటకకర్తగా తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు తరతరాలకూ చిరస్మరణీయం.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
**9440595494**

# మహిళల క్రికెట్‌లో ట్రాన్స్‌జెండర్‌కు చోటా?

- అనయా బంగర్ వ్యవహారంపై మరిజానే కాప్ ఆగ్రహం
- మహిళల క్రికెట్‌లో అనుమతించడం సరికాదంటూ అభ్యంతరం
- సామాజిక మాధ్యమాల్లో కాప్ వ్యాఖ్యలపై మిశ్రమ స్పందన
- ఐసీసీ నిబంధనల నేపథ్యంలో అనయా క్రికెట్ భవితవ్యంపై చర్చ







**సిడ్నీ, ఆగస్టు 28:** భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె అనయా బంగర్ మహిళల క్రికెట్‌లో ఆడే అంశం మరోసారి చర్చకు దారితీసింది. ట్రాన్స్‌జెండర్ మహిళ అయిన అనయాను మహిళల క్రికెట్‌లో అనుమతించడంపై దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మరిజానే కాప్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అనయా బౌలింగ్ చేస్తున్న ఫొటోతో కూడిన సామాజిక మాధ్యమ పోస్టుపై కాప్ స్పందిస్తూ.. "ఇది వంద శాతం పిచ్చితనం. దీనిని అనుమతించకూడదు" అంటూ వ్యాఖ్యానించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ట్రాన్స్‌జెండర్ క్రీడాకారిణులను మహిళల క్రికెట్‌లో అనుమతించే అంశంపై ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. కొందరు కాప్ అభిప్రాయానికి మద్దతు పలుకుతుండగా, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు.

### అనయా పునరాగమనంపై ఆసక్తి

అనయా గతంలో పురుషుల విభాగంలో క్రికెట్ ఆడారు. అనంతరం లింగ పరివర్తన ప్రక్రియ చేపట్టి మహిళగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. తిరిగి క్రికెట్ మైదానంలో అడుగుపెట్టాలన్న ఆమె ఆకాంక్ష నేపథ్యంలో మహిళల పోటీల్లో పాల్గొనే అర్హతపై చర్చ మొదలైంది. అయితే మహిళల అంతర్జాతీయ క్రికెట్‌కు సంబంధించిన ఐసీసీ నిబంధనలు ఈ వ్యవహారంలో కీలకం. 2023లో ఐసీసీ ప్రకటించిన నిబంధనల ప్రకారం, పురుష యుక్తవయస్సు దశను అనుభవించిన ట్రాన్స్‌జెండర్ మహిళలు మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో పాల్గొనేందుకు అర్హులు కారు. కేవలం టెస్టోస్టిరాన్ స్థాయిలను తగ్గించుకోవడం ద్వారా అంతర్జాతీయ మహిళల క్రికెట్‌కు అర్హత పొందే అవకాశం ఆ నిబంధనల్లో లేదు.

### దేశీయ క్రికెట్‌కు వేర్వేరు నిబంధనలు

అంతర్జాతీయ క్రికెట్‌కు ఐసీసీ నిబంధనలు వర్తిస్తుండగా, దేశీయ పోటీల్లో ఆయా క్రికెట్ బోర్డుల అర్హత నిబంధనలు కీలకమవుతాయి. అందువల్ల మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో అనయా పాల్గొనగలరా లేదా అన్నది సంబంధిత దేశీయ నిబంధనలు, అర్హత ప్రమాణాల ఆధారంగానే తేలాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అనయా బంగర్ అంశం కేవలం ఒక క్రికెటర్ పునరాగమనానికి పరిమితం కాకుండా.. మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్ అథ్లెట్ల భాగస్వామ్యం, పోటీలో సమానత్వం, సమగ్రత వంటి అంశాలపై మరోసారి విస్తృత చర్చకు తెరతీసింది.




# చరిత్ర సృష్టించిన ప్రజ్ఞానంద..

### గ్రాండ్ చెస్ టూర్ టైటిల్ సొంతం

**సెయింట్ లూయిస్:** గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద.. గ్రాండ్ చెస్ టూర్ టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. అమెరికాలో జరిగిన గ్రాండ్ ఫైనల్‌లో ఫాబియానో కారౌనాను అతను ఓడించాడు. ఆరంభంలో వెనుకబడ్డ ప్రజ్ఞానంద .. ఆ తర్వాత పుంజుకున్నాడు. చివరకు 15-13 స్కోరుతో భారత ప్లేయర్ ఫాబియానోపై విజయం సాధించాడు. జీసీటీ టైటిల్‌ను ప్రజ్ఞానంద గెలవడం ఇదే తొలిసారి. ఈ విక్టరీతో అతనికి రెండు లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ దక్కింది. చివరి రోజు ఆరు పాయింట్ల లోటుతో ఉన్న ప్రజ్ఞానంద .. కారౌనాతో జరిగిన రెండు ర్యాపిడ్ గేమ్స్‌లో విక్టరీ కొట్టాడు. ఇక ఆ తర్వాత బ్లిట్జ్ సెక్షన్‌లోనూ అద్భుత ప్రదర్శన ఇచ్చి 15-13తో టైటిల్ గెలుచుకున్నాడు. తొలి క్లాసికల్ గేమ్‌లో ప్రజ్ఞా ఓడిపోయాడు. 6-0 తేడాతో ఆ గేమ్‌లో పరాజయాన్ని చూవి చూశాడు. ఆ తర్వాత రెండో క్లాసికల్ గేమ్‌ను అతను డ్రా చేసుకున్నాడు. 3-3 పాయింట్లతో ఆ గేమ్ డ్రా అయ్యింది. అయితే ఆఖరి రోజు 6 పాయింట్ల అడ్వాంటేజ్‌తో అమెరికా ప్లేయర్ ముందున్నాడు. కానీ ర్యాపిడ్ గేమ్స్‌తో ప్రజ్ఞా మొత్తం మార్చేశాడు.

# ఎనిమిదేళ్లకే చెస్‌లో 'చెక్‌మేట్' సంచలనం!

- 9కి 9 విజయాలతో కాంటినెంటల్ ఛాంపియన్‌గా సరయు
- పాన్-అమెరికన్ పోటీల్లో ఓటమెరుగని తెలుగు చిన్నారి
- యూత్ చెస్ ప్రపంచకప్‌లో అమెరికాస్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం
- ఐదేళ్లకే చెస్ బోర్డుతో స్నేహం.. మూడేళ్లలోనే ప్రపంచస్థాయి గుర్తింపు
- హైదరాబాద్-గన్నవరం మూలాలున్న కుటుంబంలో మెరిసిన చదరంగ తార






**డల్లాస్:** వయసు ఎనిమిదేళ్లు.. చదువుతున్నది మూడో తరగతి. కానీ చదరంగం బోర్డు ముందుకొస్తే మాత్రం ప్రత్యర్థి ఎంతటి వారైనా 'చెక్‌మేట్' చెప్పాల్సిందే! అమెరికాలోని డల్లాస్‌లో నివసిస్తున్న తెలుగు కుటుంబానికి చెందిన చిన్నారి సరయు తలపనేని అంతర్జాతీయ చెస్‌లో సంచలనం సృష్టించింది. కొలంబియాలోని మెడెలిన్‌లో జరిగిన క్లాసికల్ చెస్ పాన్-అమెరికన్ పోటీల్లో తన విభాగంలో తొమ్మిదికి తొమ్మిది పాయింట్లు సాధించి కాంటినెంటల్ ఛాంపియన్‌గా అవతరించింది. వారం రోజుల పాటు సాగిన పోటీల్లో సరయు తొమ్మిది రౌండ్లు ఆడింది. ఉత్తర, దక్షిణ, మధ్య అమెరికాలకు చెందిన ఏడు దేశాల క్రీడాకారులతో తలపడింది. ఒక్క గేమ్‌లోనూ ఓటమి లేకుండా తొమ్మిదికి తొమ్మిది విజయాలతో పరిపూర్ణ స్కోరు సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో అమెరికా తరఫున పాల్గొన్న పిన్న వయస్కులైన బాలికల్లో ఒకరిగా సరయు ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ ఏడాది చివర్లో జరిగే యూత్ చెస్ ప్రపంచకప్‌లో అమెరికాస్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశాన్నీ దక్కించుకుంది. ఫిడే ఉమెన్ క్యాండిడేట్ మాస్టర్ టైటిల్‌కు అవసరమైన అర్హతను తాత్కాలికంగా సాధించిన అత్యంత పిన్న వయస్కుల్లో ఒకరిగా నిలిచింది. పోటీలు ముగించుకుని డల్లాస్‌కు చేరుకున్న సరయుకు కుటుంబ సభ్యులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. స్థానిక మీడియాతో పాటు ఇర్వింగ్, ఫ్రిస్కో నగరాల మేయర్లు ఆమె ప్రతిభను అభినందించారు. నాలుగుసార్లు అమెరికా మహిళల చెస్ ఛాంపియన్‌గా నిలిచిన కారిస్సా యిప్, ప్రముఖ చెస్ క్రీడాకారుడు, విశ్లేషకుడు సాగర్ షా సైతం సరయును అభినందించారు.సరయు చెస్ ప్రయాణం ఐదేళ్ల వయసులోనే మొదలైంది. కాపెల్ చెస్ క్లబ్‌లో గ్రూప్ తరగతులకు హాజరవుతూ చదరంగంలో తొలి అడుగులు వేసింది. అప్పట్లో కూచిపూడి, పియానో, చిత్రలేఖనం, జిమ్నాస్టిక్స్‌తో పాటు చెస్‌ను కూడా సరదాగా నేర్చుకునేది. ఓ స్థానిక టోర్నమెంట్‌లో సరయు ఆటతీరును గమనించిన అనిల్ గుట్ల ఆమెలో అసాధారణ ప్రతిభ ఉందని గుర్తించారు. వ్యక్తిగత శిక్షణ ఇప్పిస్తే ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశం ఉందని తల్లి శ్రీలక్ష్మికి సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు ఇంటర్నేషనల్ మాస్టర్ సాక్షం రౌటెలాను సంప్రదించారు. సరయు సామర్థ్యాన్ని గుర్తించిన ఆయన ప్రత్యేక శిక్షణతో మరింత రాణించగలదని సూచించారు. అనంతరం మరో ఇంటర్నేషనల్ మాస్టర్ వద్ద వ్యక్తిగత శిక్షణ కొనసాగిస్తోంది. సరయు ప్రతిభ అనతికాలంలోనే రేటింగ్ జాబితాల్లోనూ ప్రతిఫలించింది. 2025 డిసెంబరు నాటికి అమెరికాలో ఏడేళ్లు లేదా అంతకంటే తక్కువ వయసున్న బాలికల టాప్-100 జాబితాలో నంబర్‌వన్‌గా నిలిచింది. 2026 జనవరి నుంచి ఏప్రిల్ వరకు అండర్-8 విభాగానికి అర్హత ఉన్న బాలికల్లో ఫిడే రేటింగ్ పరంగా ప్రపంచ నంబర్‌వన్‌గా కొనసాగింది. చెస్‌లో దూసుకుపోతున్నా సరయు చదువును మాత్రం పక్కన పెట్టలేదు. డల్లాస్‌లోని గ్రేట్ హార్ట్స్ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. పాఠశాల ముగిసిన తర్వాత చెస్ సాధన.. వారాంతాల్లో టోర్నమెంట్లు ఆమె దినచర్యగా మారాయి. సమయాభావంతో కూచిపూడికి విరామం ఇచ్చినా పియానోను కొనసాగిస్తోంది. వేసవి సెలవుల్లో టైక్వాండో కూడా నేర్చుకుంటోంది. సరయు తండ్రి హైదరాబాద్‌కు, తల్లి శ్రీలక్ష్మి గన్నవరానికి చెందినవారు. ఉపాధి రీత్యా అమెరికాలో స్థిరపడిన ఈ తెలుగు కుటుంబంలో పుట్టిన సరయు ఇప్పుడు అంతర్జాతీయ చదరంగ వేదికపై తనదైన ముద్ర వేస్తోంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, శిక్షకుల ప్రోత్సాహమే తమ కుమార్తె విజయాలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఐదేళ్లకు సరదాగా చేతిలోకి తీసుకున్న చదరంగపు పావులు.. ఎనిమిదేళ్లకే సరయును కాంటినెంటల్ ఛాంపియన్‌గా నిలబెట్టాయి. తొమ్మిది రౌండ్లలో తొమ్మిది విజయాలు సాధించిన ఈ తెలుగు చిన్నారి ప్రయాణం ఇక్కడితో ఆగేది కాదు.. ఇప్పుడు ఆమె గురి ప్రపంచ చదరంగ కిరీటాలపైనే!

# సరైన వ్యక్తి దొరికితే.. పెళ్లికి సిద్ధమే!

### వివాహం, వ్యక్తిగత జీవితంపై మనసు విప్పిన మిథాలీ రాజ్
### 23 ఏళ్ల క్రికెట్ ప్రయాణంలో ఆటకే తొలి ప్రాధాన్యం
### వ్యక్తిగత బంధాలకు తగిన సమయం ఇవ్వలేకపోయానని వెల్లడి
### స్వేచ్ఛను అర్థం చేసుకునే భాగస్వామి కావాలన్న మాజీ కెప్టెన్
### ప్రస్తుత జీవితం ఎంతో సంతృప్తికరంగా ఉందని వ్యాఖ్య

**హైదరాబాద్:** "సరైన వ్యక్తి తారసపడితే వివాహం గురించి తప్పకుండా ఆలోచిస్తా.. అది సహజంగా జరగాలి" అంటూ భారత మహిళా క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ తన మనసులోని మాట బయటపెట్టారు. సుదీర్ఘ క్రికెట్ ప్రయాణంలో ఆటకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చానని, అందువల్ల వ్యక్తిగత జీవితానికి తగినంత సమయం కేటాయించలేకపోయానని చెప్పారు. తాజాగా ఓ టీవీ చానల్ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మిథాలీ తన వ్యక్తిగత జీవితం, పెళ్లిపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. చిన్న వయసులోనే క్రికెట్ ప్రయాణాన్ని ప్రారంభించిన మిథాలీ.. 2022లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే వరకు తన జీవితంలో ఎక్కువ భాగం ఆటకే అంకితం చేసినట్లు చెప్పారు. క్రికెట్‌కు ఇచ్చినంత సమయం, నిబద్ధతను వ్యక్తిగత బంధాలకు ఇవ్వలేకపోయానని పేర్కొన్నారు. "ఒక కూతురిగా, సోదరిగా, స్నేహితురాలిగా నా వ్యక్తిగత సంబంధాలకు ఇవ్వాల్సినంత సమయం ఇవ్వలేకపోయాను. నా సమయం, ఆలోచనలు ఎక్కువగా క్రికెట్ చుట్టూనే తిరిగేవి" అని తన సుదీర్ఘ క్రీడా ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. వివాహం విషయంలో తనకు ఎలాంటి వ్యతిరేకత లేదని మిథాలీ స్పష్టం చేశారు. "నాకు సరైన వ్యక్తి దొరికితే కచ్చితంగా పెళ్లి గురించి ఆలోచిస్తాను. ఏదైనా సహజంగా జరిగితే దానికి నేను సిద్ధంగానే ఉంటాను" అని పేర్కొన్నారు. మహిళా క్రీడాకారిణులు తమ జీవితాలను స్వతంత్రంగా తీర్చిదిద్దుకుంటారని, అందువల్ల వారి జీవనశైలిని, స్వేచ్ఛను అర్థం చేసుకునే భాగస్వామిని కోరుకోవడం సహజమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తనకు లభిస్తున్న స్వేచ్ఛతో పాటు కుటుంబంతో గడుపుతున్న సమయం ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. క్రికెట్ నుంచి రిటైరైన తర్వాత తన జీవితం మరో కొత్త దశలోకి ప్రవేశించిందని మిథాలీ చెప్పారు. ప్రస్తుతం తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవడంతో పాటు క్రికెట్‌కు సంబంధించిన బాధ్యతలు నిర్వర్తించడం, యువ క్రీడాకారిణులకు మార్గదర్శకత్వం అందించడంలో సమయాన్ని వెచ్చిస్తున్నట్లు తెలిపారు. జీవితంలో ఏదో కోల్పోయానన్న భావన తనకు లేదని మిథాలీ స్పష్టం చేశారు. ప్రస్తుతం తనకు ఉన్న స్వేచ్ఛ, కుటుంబంతో గడిపే సమయం ఎంతో సంతృప్తిని ఇస్తున్నాయని పేర్కొన్నారు. క్రికెట్ మైదానంలో రెండు దశాబ్దాలకు పైగా భారత మహిళల జట్టుకు వెన్నెముకగా నిలిచిన మిథాలీ.. ఇప్పుడు జీవిత భాగస్వామి విషయంలోనూ తొందరేమీ లేదంటున్నారు. 'సరైన వ్యక్తి.. సరైన సమయంలో' తారసపడితే పెళ్లికి సిద్ధమేనంటూ తన వ్యక్తిగత జీవితంపై స్పష్టత ఇచ్చారు.






# ఆసియా క్రీడల్లో అధ్వాన వసతులు

### 'బీ' టీమ్‌ను పంపే యోచనలో బీసీసీఐ
### జపాన్‌లోని ఐచీ-నగోయాలో టెంట్ డ్రెస్సింగ్ రూమ్‌లు, 500 మీటర్ల దూరంలో వాష్‌రూమ్‌లపై బీసీసీఐ తీవ్ర ఆగ్రహం
### పరిస్థితులు మారకుంటే ప్రధాన జట్ల స్థానంలో 'బీ' జట్లను పంపించే అవకాశం

**ఢిల్లీ, ఆగస్టు 28:** జపాన్‌లోని ఐచీ-నగోయా వేదికగా సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభం కానున్న ఆసియా క్రీడల్లో క్రికెటర్ల వసతుల కల్పనపై తీవ్ర వివాదం రేగుతోంది. ప్రపంచ స్థాయి క్రికెటర్లు పాల్గొనే ఈ మెగా ఈవెంట్‌లో ఆటగాళ్లకు టెంట్లలో డ్రెస్సింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయడం, వాష్‌రూమ్‌లు ఏకంగా 500 మీటర్ల దూరంలో ఉండటం మరియు హోటల్ గదులు చిన్నగా ఉండటంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) కూడా ఈ ఏర్పాట్ల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉంది. టోర్నీ ప్రారంభానికల్లా జపాన్ ఒలింపిక్ కమిటీ ఈ లోపాలను సరిదిద్దకుంటే, పురుషులు మరియు మహిళల విభాగాల్లో ముందస్తుగా ప్రకటించిన ప్రధాన జట్ల స్థానంలో 'బీ' జట్లను పంపాలని బీసీసీఐ భావిస్తోంది. ఇప్పటికే పరిస్థితులను సమీక్షించేందుకు ప్రత్యేక పరిశీలకులను జపాన్ పంపనున్నట్లు బోర్డు వర్గాలు తెలిపాయి. కాగా, సెప్టెంబర్ 17 నుంచి మహిళల మ్యాచ్‌లు, సెప్టెంబర్ 24 నుంచి పురుషుల మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. చైనాలోని హంగ్జూ ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత జట్లు, ఈసారి కూడా పసిడి గెలవాలనే పట్టుదలతో ఉండగా ఈ వసతుల వివాదం కలకలం రేపుతోంది.

# రేస్-4 ప్రాజెక్టుకు అమీర్ గ్రీన్ సిగ్నల్



బాలీవుడ్ స్టార్ హీరో అమిర్ ఖాన్ చాలా రోజుల తర్వాత కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రముఖ యాక్షన్ ఫ్రాంచైజీ 'రేస్' నాలుగో భాగంలో ఆయన నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'రేస్ 4' స్క్రిప్ట్ అమిర్ ఖాన్‌కు బాగా నచ్చడంతో ఆయన ఈ ప్రాజెక్ట్‌ను చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఈ చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యతలను ప్రముఖ దర్శకుడు విజయ్ కృష్ణ ఆచార్యకు అప్పగించినట్లు సమాచారం. గతంలో అమిర్ ఖాన్, విజయ్ కృష్ణ ఆచర్య కాంబినేషన్‌లో వచ్చిన 'ధూమ్ 3' సినిమా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను విజయ్‌కి ఇవ్వబోతున్నట్లు సమాచారం. కాగా.. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# దూసుకుపోతున్న ఇరుముడి

## గ్రామీణ ప్రాంతాల్లో భారీగా టికెట్ల అమ్మకం




మాస్ మహారాజా రవితేజ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతూ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. విడుదలైనప్పటి నుంచి వం-ˇసగా రికార్డులు సృష్టిస్తున్న ఈ చిత్రం తాజాగా ఆన్‌లైన్ టికెట్ విక్రయాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. ప్రముఖ టికెటింగ్ ఎ÷-లాట్‌ఫార్మ్‌లైన బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్స్ ద్వారానే 'ఇరుముడి'కి 55 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఒక ప్రాంతీయ చిత్రానికి ఈ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రవితేజ మాస్ అప్పీల్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుండటంతో థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ కొనసాగుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మాస్ ప్రేక్షకుల వరకు అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో సినిమా కలెక్షన్ల పరంగా కూడా దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఇరుముడి' ఇప్పుడు టికెట్ విక్రయాల్లోనూ తన సత్తా చాటుతూ కొత్త రికార్డులను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చిత్రానికి ఉన్న జోరు చూస్తుంటే రాబోయే రోజుల్లో మరిన్ని మైలురాళ్లు అందుకోవడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.






# శూర్పణఖ ఓ భిన్నమైన వ్యక్తిత్వం ఉన్న మహిళ

## కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్

రామాయణ స్క్రిప్ట్ తనకు శూర్పణఖలోని కొత్త కోణాలను అన్వేషించడంలో సహాయపడిందని కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. ఇప్పుడామె నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రామాయణ: పార్ట్ 1' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆమె రావణుడి సోదరి అయిన శూర్పణఖ పాత్రలో కనిపించనుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ ఈ సినిమాలోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. శూర్పణఖ జీవితంలోని ఇంతకుముందు తెలియని కొన్ని కోణాలు ఈ పాత్ర చేయటం ద్వారా తెలుసుకున్నాను. ఆమె గురించి నాకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. నేను ఈ స్క్రిప్ట్ చదివినప్పుడు, లక్ష్మణుడు ఆమె ముక్కును కోసిన సంఘటన కంటే ముందు, ఆ తర్వాత ఆమె జీవితం గురించి చాలా విషయాలు అందులో ఉన్నాయి. నేను ఈ పాత్ర చేయడం ద్వారా నాకు ఇవన్నీ ఆసక్తిగా అనిపించాయి. అందుకే నాకు ఈ పాత్ర చాలా బాగా నచ్చింది. శూర్పణఖ వ్యక్తిత్వంలోని విభిన్న కోణాలకు నేను ఆకర్షితురాలినయ్యాను. లంకలో ఆమెను అత్యంత అందమైన మహిళ అని అనేవారు. ఆమెకు అహం ఉండేది. చరిత్ర తరచుగా ఆమెను ఒక భయంకరమైన ప్రతినాయకురాలిగా మాత్రమే గుర్తుంచుకున్నప్పటికీ శూర్పణఖలోని సహజసిద్ధమైన సంక్లిష్టతే నేను ఈ పాత్రను పోషించేలా చేసిందంటూ చెప్పుకొచ్చింది.




# 18న వస్తోన్న అనుమాన పక్షి

డిజె టిల్లు'తో సెన్సేషనల్ డెబ్యూను అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ రెండో సినిమా 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా ఈ సినిమాను రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మించారు. తొలి చిత్రం తరహాలోనే ఈ సినిమానూ యునిక్ కామెడీ ఎంటర్ టైనర్ గా విమల్ కృష్ణ తెరకెక్కించారు. తమ 'అ-నుమాన పక్షి' చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల తేదీని తెలియజేస్తూ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా విభిన్నమైన టోన్‌తో పాటు హీరో విచిత్రమైన ఆలోచనా విధానాన్ని ఈ పోస్టర్ ప్రజెంట్ చేస్తోంది. రాగ్ మయూర్ సంప్రదాయ దుస్తుల్లో చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపిస్తున్నారు. ఆయన పక్కనే ఉన్న బ్లాక్‌బోర్డుపై 'డౌట్స్ అండర్ ఇన్వెస్టిగేషన్' అనే టైటిల్‌తో జీవితం, విధి, కర్మ, దేవుడి ఎ÷-లానింగ్స్ కు సంబంధించిన ఆసక్తికరమైన ప్రశ్నలను పొందుపరిచారు. 'ఒన్ బోయ్. బిలియన్ థాట్స్, జీరో చిల్' అనే ట్యాగ్‌లైన్ ఆయన పాత్రలోని ఆలోచనా విధానాన్ని మరింత ఆసక్తికరంగా తెలియజేస్తోంది.

# జివితో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న చిరు




తన మిత్రుడు జీవీ నారాయణ రావు అంత్యక్రియలకు హాజరయిన చిరంజీవి ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన చిరంజీవి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారాయణ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 1977 నుంచి మా ఇద్దరి మధ్య పరిచయం. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో కలుసుకున్నాం. తను అప్పటికే సీనియర్ స్టూడెంట్. మేం ట్రైనింగ్‌లో ఉన్నప్పుడు తన అనుభవాలు పంచుకునేవాడు. చాలా క్లోజ్‌గా ఉండేవాళ్లం. తర్వాత ఇండస్ట్రీలో ఎవరికి వాళ్లం బిజీ అయ్యాం. నా సినిమాల్లోనూ ఆయన నటించారు. ఆ తర్వాత మా బాధ్యతల వల్ల ఇద్దరి మధ్య గ్యాప్ వచ్చింది. యాదృచ్ఛికం ఏంటంటే.. పది రోజుల క్రితం కూడా 'మంచుపల్లకి' చూశాను. అందులో ఆయన కీలకపాత్రలో నటించారు. ఆ సినిమా స్ఫూర్తితో కొత్త కంటెంట్‌తో, ఐదుగురు కొత్త వాళ్లతో ఒక స్టోరీ రాశానని జీవీ చెప్పారు. నన్ను చూడాలన్నారు. దాని గురించి మాట్లాడిన తర్వాత ఇద్దరం కలిసి ఓ ఫొటో దిగాం. బహుశా ఆయన చివరి ఆలోచనలు నాతో పంచుకున్నారేమో. చాలా మొండి మనిషి. ఏ విషయాన్నీ లెక్క చేయడు అని తన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# టాక్సిక్‌లో మహిళలను తప్పుగా చిత్రీకరణ

## తమిళనాడు మాజీ బిజెపి నేత అన్నామలై ఆగ్రహం

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాపై తమిళనాడుకు చెందిన మాజీ బీజేపీ నేత కే. అన్నామలై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో మహిళలను తప్పుగా చిత్రీకరించారని, ఇది యువతపై చెడు ప్రభావం చూపుతుందని ఆయన విమర్శించారు. కోయంబత్తూరులో జరిగిన ఓ బహిరంగ సభలో అన్నామలై మాట్లాడుతూ సినిమాల ప్రభావం సమాజంపై ఏ విధంగా ఉంటుందో ప్రస్తావించారు. 'నిన్న ఓ సినిమా గురించి విన్నాను. అది మొదటి రోజే రూ. 104 కోట్లు వసూలు చేసింది. మనం ఎప్పుడూ మంచి విషయాలు మాట్లాడాలని చూస్తాం, కానీ ఏకంగా సినిమా పేరునే 'టాక్సిక్' అని పెట్టుకున్నారు. ఈ చిత్రం మహిళలను తప్పుగా చూపిస్తూనే భారీగా డబ్బు సంపాదిస్తోంది' అని ఆయన మండిపడ్డారు. ఇలాంటి చిత్రాలను విద్యార్థులు, యువత చూస్తే దేశం ఏ దిశగా పయనిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు నగరాల్లో మహిళల భద్రత గురించి చర్చిస్తున్నామని, మరోవైపు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (అఃఈఅ) ఇలాంటి చిత్రాలకు ఎలా అనుమతి ఇస్తోందని ఆయన ప్రశ్నించారు. సినిమాలలో మహిళలను గౌరవించే విధానం ఉండాలని, సర్టిఫికేషన్ విషయంలో సెన్సార్ బోర్డ్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి తదితరులు కీలక పాత్రలు పోషించారు. బుధవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధించినప్పటికీ, దీనిలోని అభ్యంతరకర సన్నివేశాలు, హింస మరియు మహిళల చిత్రణపై ప్రస్తుతం సర్వత్ర చర్చ జరుగుతోంది.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com